

స్మార్ట్ సిటీ మిషన్ 'సిటీస్' ప్రాజెక్టుకు రూ.5.2 కోట్లు

- ఎంపిక చేసిన పాఠశాలలను స్మార్ట్ క్యాంపస్‌లుగా మార్చేందుకు వినియోగం

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ మిషన్ కింద జీవీఎంసీ పరిధిలో అమలుచేస్తున్న సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్ ఇంటిగ్రేటెడ్ అండ్ సస్టెయిన్ (సిటీస్) ప్రాజెక్టుకు 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి విడత కింద రూ.5.2 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ పరిధిలో సిటీస్ కింద అభివృద్ధి చేస్తున్న పాఠశాలలను స్మార్ట్ క్యాంపస్‌లుగా మార్చేందుకు నిధులను వెచ్చించాల్సి ఉంటుంది.

రైల్వే డివిజన్ కొనసాగింపు

పేరు మాత్రం మార్పు

- 'వాల్తేరు' స్థానంలో 'విశాఖపట్నం'
- రైల్వే బోర్డు నిర్ణయం
- పరిధి మాత్రం భారీగా కుదింపు
- కేవలం 410 కిలోమీటర్లు మాత్రమే...
- రాయగడ డివిజన్‌లోకి కేకే లైన్




డీఆర్ఎం కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'వాల్తేరు రైల్వే డివిజన్' అనే పదం ఇకపై వినిపించదు. చరిత్ర పుటల్లో కలిసిపోతుంది. అదే స్థానంలో కొత్తగా 'విశాఖపట్నం డివిజన్' పేరు ప్రాచుర్యంలోకి వస్తుంది. కొత్త ప్రస్థానం మొదలవుతుంది. ఇదంతా ఉత్తరాంధ్ర ప్రజల పోరాటం, రాజకీయ నాయకుల ఒత్తిడి, కార్మిక సంఘాల ఆందోళనల వల్లే సాధ్యమైంది.

దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న రైల్వే జోన్ ఇస్తామని ఐదేళ్ల క్రితం కేంద్రం ప్రకటించినా మరోవైపు వాల్తేరు డివిజన్ ఉండదని, దానిని రద్దు చేస్తామని పేర్కొంది. దాంతో కొత్త జోన్ వస్తుందనే సంతోషం ఎవరిలోనూ కనిపించలేదు. వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తూ, 132 సంవత్సరాల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌తో కూడిన జోన్ ఇవ్వాలనే డిమాండ్ మొదలైంది. గత నెలలో జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసినప్పుడు కూడా నాయకులు అదే కోరారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ గాని, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గానీ దీనిపై పెదవి విప్పలేదు. వాల్తేరు డివిజన్ ఉంచుతారో లేదో చెప్పకుండానే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. మరోవైపు ఒడిశాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ... మిగతా 6వ పేజీలో

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష నెరవేరింది



వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం పేరుతో కొనసాగిస్తామని పేర్కొంటూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష నెరవేరింది. రైల్వే ఉద్యోగుల్లో నెలకొన్న అనుమానాలన్నీ పటాపంచలు అయ్యాయి. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి ముందడుగు పడింది. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన మరో విజయం. ఏదో సాధించమనే దాని కంటే ప్రజల ఆకాంక్ష నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది. - శ్రీభరత్, విశాఖ ఎంపీ

ప్రజల ఆకాంక్షలకు విలువ ఇచ్చారు



ప్రజల ఆకాంక్షలకు విలువ ఇస్తూ వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్ పేరుతో కొనసాగించాలనే నిర్ణయం సంతోషకరం. ఎన్‌డీఏ హయాంలో ఇది మరో విజయం. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ద్వారా రాష్ట్రానికి మరిన్ని ప్రాజెక్టులు, రైళ్లు రావాలని కోరుకుంటున్నా. ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబునాయుడులకు ధన్యవాదాలు.
- గంటా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

పూర్ణామార్కెట్‌లో ఆశీల్ కాంట్రాక్టర్ దందా

జీవీఎంసీ గెజిట్‌కు తిలోదకాలు

- నిర్దేశించిన రేట్ల కంటే పదింతలు ఎక్కువ వసూలు
- రోడ్డుమీద తట్టపెడితే రూ.250 కట్టాల్సిందే

- చిరు వ్యాపారుల గగ్గోలు
- పార్కింగ్ ప్రాంతాల్లో చిరు వ్యాపారాల నిర్వహణకు సహకారం
- ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకుపోయిన రహదారి
- ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోని పోలీసులు


పూర్ణామార్కెట్ వద్ద రోడ్డుపైనే వ్యాపారాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఆశీల్ వసూలు పేరుతో పెద్దఎత్తున దోపిడీ జరుగుతోంది. జీవీఎంసీ నిర్దేశించిన రేట్ల కంటే పదింతలు అధికంగా వసూలు చేస్తూ చిరు వ్యాపారులను కాంట్రాక్టర్ దోచుకుంటున్నారు. కొనుగోలుదారులు వాహనాలు నిలుపుకునే ప్రాంతంలో కూడా జంగిడీ (తట్ట)లతో వ్యాపారాలు పెట్టించేసి వారి నుంచి రోజుకు రూ.250 వసూలుచేసి జేబులు నింపుకుంటున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

పూర్ణామార్కెట్‌లో ఆశీల్ వసూలు ఇలా..

కేటగిరీ	జీవీఎంసీ నిర్దేశిత ధర	కాంట్రాక్టర్ వసూలు చేస్తున్నది
సైకిల్‌పార్కింగ్	రూ.5	రూ.20
కారు పార్కింగ్	రూ.10	రూ.30
లోడు లారీ	రూ.125	రూ.500
లారీ వంతులోడ్	రూ.75	రూ.300
మినీ వ్యాన్/ట్రాక్టర్	రూ.75	రూ.250
గూడ్స్‌ఆటో	రూ.25	రూ.150
తోపుడు బండి	రూ.10	రూ.300
జంగిడి	రూ.20	రూ.250

పూర్ణామార్కెట్‌లో నాలుగు కేటగిరీల్లో సుమారు 200 దుకాణాలు ఉన్నాయి. దుకాణాలతోపాటు మార్కెట్‌కు సరకులు తీసుకొచ్చి, తీసుకువెళ్లే వాహనాల నుంచి ఆశీల్, పార్కింగ్ (కొనుగోలుదారుల వాహనాలు) ఫీజు వసూలుకు సంబంధించి జీవీఎంసీ ఏటా వేలం నిర్వహిస్తుంది. గత ఏడాది పూర్ణామార్కెట్ ఆశీల్ వసూలు కాంట్రాక్టును సుమారు రూ.62 లక్షలకు ఒకరు పాడుకున్నారు. పార్కింగ్ ఫీజు ఎంత వసూలుచేయాలి, దుకాణాల నుంచి ఆశీల్ ఎంత వసూలుచేయాలి, మార్కెట్‌కు లోడుతో వచ్చే వాహనాలు, తిరిగి లోడుతో వెళ్లే వాహనాల నుంచి ఎంత వసూలు చేయాలనేది నిర్దేశిస్తూ కాంట్రాక్టు అప్పగించినప్పుడే గెజిట్‌ను అందజేశారు. దీనిప్రకారం పార్కింగ్ ఫీజు కింద మార్కెట్‌కు వచ్చే ద్విచక్ర వాహనానికి రూ.5, కారుకు రూ.పది చొప్పున వసూలు చేయాలి. అలాగే మార్కెట్ లోపల ఉండే దుకాణాలను నాలుగు కేటగిరీలుగా విభజించి రూ.25 నుంచి గరిష్ఠంగా రూ.35 వసూలుచేయాలని నిర్దేశించారు. కానీ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆశీల్ గెజిట్‌ను పక్కనపెట్టేసి, తనకు నచ్చినట్టు ఆశీల్ రశీదులను ప్రింట్ చేయించి, దాని ప్రకారమే వసూలుచేయడం ప్రారంభించారు. ద్విచక్ర వాహనం నుంచి రూ.ఐదుకు బదులు రూ.20, కారుకు రూ.పదికి బదులు రూ.30 వసూలు చేస్తున్నారు. దీనిపై వాహన చోదకులు ఎవరైనా ప్రశ్నిస్తే రశీదు చూసుకోవాలంటూ దురుసుగా జవాబిస్తున్నారు. ఇక మార్కెట్‌లో దుకాణాల నుంచి గెజిట్‌లో పేర్కొన్నట్టుగానే ఆశీల్ వసూలు చేస్తున్నప్పటికీ, బయట తోపుడుబండ్లు, తట్టలు, బుట్టలు (జంగిడీ) పెట్టుకుని వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులను మాత్రం దోచుకుంటున్నారు. వాహనాలను పార్కింగ్ ... మిగతా 6వ పేజీలో

బెట్టింగ్ కేసుపై నీలినీడలు



నత్తనడకన దర్యాప్తు

- ఇప్పటివరకూ 11 మంది అరెస్టు
- వారి వివరాలు వెల్లడించని పోలీసులు
- పేర్లు చెబితే ప్రధాన నిందితులు తప్పించుకుంటారని కొత్త వాదన
- రాజకీయ ఒత్తిళ్లే కారణమని ప్రచారం
- రూ.176 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తింపు?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో సంచలనం సృష్టించిన క్రికెట్ బెట్టింగ్ కేసు దర్యాప్తుపై నీలినీడలు కమ్ముకున్నట్టున్నాయి. బుకీ లగుడు రవికుమార్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత నెల 12న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదే కేసులో ఇప్పటివరకూ మరో పది మందిని అరెస్టు చేసినట్టు చెబుతున్న పోలీసులు...వారి వివరాలు మాత్రం వెల్లడించడం లేదు. అరెస్టు అయిన వారి పేర్లు చెబితే పరారీలో ఉన్న ప్రధాన నిందితులు తప్పించుకుంటారంటూ సమాధానం చెబుతున్నారు. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే కేసు దర్యాప్తు మందగించడంతోపాటు వివరాలు గోప్యంగా ఉంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని గాయత్రి టవర్స్‌లో లగుడు రవికుమార్ అనే బుకీని గత నెల 12న టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని విచారించగా ఇసుకతోట ప్రాంతానికి చెందిన పల్లా త్రినాథ్, శివాజీపాలేనికి చెందిన బొబ్బిలి రవికుమార్, మరికొందరు కలిసి బుకీల అవతారం ఎత్తి నగరంలో పెద్దఎత్తున బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తేలింది. దీంతో కేసు విచారణను సీపీ శంఖబ్రతబాగ్చి సైబర్‌క్రైమ్ పోలీసులకు అప్పగించారు. సైబర్‌క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి బుకీలు సుమారు 80 బ్యాంకు ఖాతాల నుంచి రూ.176 కోట్ల లావాదేవీలు చేసినట్టు గుర్తించారు. ఆయా ఖాతాల్లో ఉన్న రూ.45 లక్షలను ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో మరో పది మందిని అరెస్టు చేసినట్టు పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. అయితే ప్రకటనల్లో అరెస్టు చేసినవారి పేర్లు, బెట్టింగ్‌లో వారి పాత్ర ఏమిటనేది వెల్లడించలేదు. అరెస్టు చేసినవారి పేర్లు చెబితే కేసులో ప్రధాన నిందితులు తప్పించుకునేందుకు అవకాశం ఉంటుందని సమాధానం చెబుతుండడం అనుమానాలు రేకెత్తిస్తోంది. బెట్టింగ్ కేసులో నిందితులు కొందరిని కాపాడేందుకు పోలీసులపై రాజకీయ నేతలు ఒత్తిడి చేస్తున్నారనే ప్రచారం గత కొద్దిరోజులుగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తులో వేగం తగ్గించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఏదైనా కేసులో నిందితుడు పరారీలో ఉంటే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వారం, పది రోజుల్లోపే గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. అలాంటిది కేసు నమోదుచేసి 20 రోజులైనా సరే నిందితులను పట్టుకోలేకపోతున్నామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పైగా అరెస్టు చేసిన వారి పేర్లను బయటపెడితే మిగిలిన నిందితులు తప్పించుకుంటారని చెబుతుండడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా ఈ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉంది, బెట్టింగ్ నిర్వహణలో ఎవరిపాత్ర ఏమిటో పోలీసులు వెల్లడిస్తారో, లేదో...చూడాలి.

ట్రాఫిక్ నిర్వహణకు ఏఐ

తొలిదశలో 101 కూడళ్లలో అందుబాటులోకి...

- సిగ్నల్స్‌కు అనుసంధానం
- వాహనాల రద్దీని బట్టి పనిచేసేలా మార్పు
- ఆర్టిఫిషియల్ టెక్నాలజీతో పనిచేసే సీసీ కెమెరాల ఏర్పాటు
- హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే...ఆటోమేటిక్‌గా ఈ-చలాన్ జారీ
- పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ ప్రతిపాదనలు
- టెండర్లకు ఆహ్వానం


హనుమంతువాక కూడలిలో ట్రాఫిక్ రద్దీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు 'ఆర్టిఫిషియల్ డ్రైవెన్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్' దిశగా అడుగులు పడుతున్నాయి. పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు దీనికి సంబంధించి కసరత్తు ప్రారంభించారు. తొలిదశలో నగరంలోని 101 కూడళ్లలో ఏఐ టెక్నాలజీతో సిగ్నల్స్, సీసీ కెమెరాలు పనిచేసేలా ప్రతిపాదనలు తయారుచేశారు.

నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా సగటున 350 మంది వరకూ ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ లైట్ వెలిగినా పట్టించుకోకుండా ముందుకువెళ్లి ప్రమాదాలకు కారణంగా మారుతున్నారు. మరికొందరు ఎన్నిసార్లు జరిమానా విధించినాసరే హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం వంటి ఉల్లంఘనలకు ... మిగతా 6వ పేజీలో

101 జంక్షన్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్ఎఫ్‌పీ

నగర పరిధిలోని 101 ట్రాఫిక్ జంక్షన్లలో సిగ్నల్స్ ప్రారంభం, జంక్షన్ల సింక్రనైజేషన్‌తోపాటు ఏఐతో ఇంటిగ్రేషన్‌కు ఎంత అవసరమవుతుందనే దానిపై అనుభవం, ఆసక్తి కలిగిన ఏజెన్సీలు, సంస్థల నుంచి జీవీఎంసీ అధికారులు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) పిలిచారు. సీసీ కెమెరాల సరఫరా, అమర్చడం, నిర్వహణ బాధ్యతలను చేపట్టేందుకు ఎంత చెల్లించాలనే దానిపై ఆయా సంస్థలు ప్రతిపాదనలు పంపిస్తే అందరికంటే తక్కువ ఖర్చు అవుతుందని ఆర్ఎఫ్‌పీ సమర్పించిన ఏజెన్సీకి వీటి పనులు అప్పగిస్తారు. టెస్టింగ్ కోసం తొలిదశలో 11 జంక్షన్లలో వీటిని ఏర్పాటుచేయాలని జీవీఎంసీ అధికారులు ఆర్ఎఫ్‌పీలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల ఎనిమిదో తేదీ వరకూ గడువు ఇచ్చారు.

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్‌టికెట్లు

- పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ పంపించే ఏర్పాట్లు
- హాజరు తక్కువైన విద్యార్థులకు ఫైన్ రద్దు
- సేవలను సులభతరం చేసిన ఇంటర్ బోర్డు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ ద్వారా పౌర సేవలను అందిస్తోన్న ప్రభుత్వం ఇంటర్ హాల్‌టికెట్‌లను కూడా అదే పద్ధతిలో పంపాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. హాల్‌టికెట్లు జనరేట్ కాగానే వారి వాట్సాప్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఫీజులు చెల్లించిన విద్యార్థుల ఫోన్ నంబర్లను జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సేకరించి బోర్డుకు పంపిస్తున్నాయి. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఈనెల పదో తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వాటికి హాజరయ్యే విద్యార్థుల వాట్సాప్‌కు హాల్‌టికెట్లను పంపించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. కాగా మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షల హాల్‌టికెట్లను ఈనెల 15వ తేదీ .. మిగతా 6వ పేజీలో

అదనపు కమిషనర్ అడ్డగోలు వసూళ్లు!

బిల్లులో 0.5 శాతం కమీషన్‌గా ఇవ్వాలని షరతు

- పైసలివ్వకుంటే ఫైలు కదలని పరిస్థితి
- కాంట్రాక్టర్ల గగ్గోలు
- ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని వేడుకోలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) అదనపు కమిషనర్ ఒకరు...తన పరిధిలో ఉన్న విభాగాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమీషన్ ఇవ్వకపోతే ఫైల్‌ను అకౌంట్స్ విభాగానికి పంపించకుండా పక్కనపెట్టేస్తున్నారని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

జీవీఎంసీలో ముగ్గురు అదనపు కమిషనర్లు ఉన్నారు. ఒక్కో అదనపు కమిషనర్‌కు కొన్ని విభాగాలను కేటాయించారు. వారిలో ఒకరు కొంత కాలం కిందటి వరకు హుందాగానే వ్యవహరించినప్పటికీ ఇటీవల కాలంలో వసూళ్లకు తెరలేపారు. తన పరిధిలోని విభాగాల్లో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసిన తర్వాత బిల్లు చెల్లింపు కోసం కిందిస్థాయి అధికారులు తయారుచేసిన ఫైలు వివిధ స్థాయిలు దాటి అదనపు కమిషనర్‌కు చేరుతుంది. అక్కడి నుంచి అకౌంట్స్ విభాగానికి పంపించాల్సి ఉంటుంది. అయితే ఫైల్‌ను అకౌంట్స్ విభాగానికి పంపించాలంటే బిల్లు మొత్తంలో తనకు 0.5 శాతం కమీషన్‌గా ఇవ్వాలని కాంట్రాక్టర్లకు చెప్పాలని తన ఛాంబర్‌లోని సిబ్బందికి సదరు అదనపు కమిషనర్ సూచించారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది అదే విషయాన్ని కాంట్రాక్టర్లకు చెప్పారు. ఇప్పటికే చాలామందికి కమీషన్ చెల్లిస్తున్నామని, ఇప్పుడు కొత్తగా అదనపు కమిషనర్‌కు ఇవ్వాలని చెప్పడం ఏమిటని అవాక్కయ్యారు. తాము ఇవ్వలేమని కాంట్రాక్టర్లు చెప్పడంతో అయితే ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందని పక్కనపెట్టేస్తున్నారు. దీంతో సదరు అధికారి డిమాండ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు ఓకే చెబుతున్నారు. అయితే ఒకరు దీనిపై సంబంధిత అధికారిని ... మిగతా 6వ పేజీలో

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు ఐజీ అరోమా సింగ్ ఠాగూర్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎంపీ ప్రదీప్‌చంద్రదేవ్ ఉన్నారు. వారికి ఆలయ ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.


మాడవీధుల్లో రోడ్డు నిర్మాణం



ప్రధాన రాజగోపురం వద్ద జరుగుతున్న పనులు

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై మాడవీధుల్లో సుమారు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. కొన్నేళ్ల కిందట వేసిన రోడ్డు పాడవ్వడంతో దానిపై కొత్తగా బీటీ రోడ్డు వేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ఈమేరకు బుధవారం తూర్పు మాడవీధిలో ప్రధాన రాజగోపురం నుంచి పనులను ప్రారంభించారు. దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీరు దండు గణ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఏఈ బాజ్జీ సారథ్యంలో ఈ పనులు జరుగుతున్నాయి.

ఒడిశాలో అప్పన్న కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు అభ్యర్థన మేరకు ఈనెల 2న అప్పన్న ప్రచార రథం ఒడిశాకు పంపించిన విషయం తెలిసిందే. ముందుగా నిర్ణయించిన ప్రకారం తొలుత పట్టుపురం తదితర ప్రాంతాల్లో ప్రతిరోజు ఉదయం నారసింహ హోమాలు, సాయంత్రం కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం గంజాం జిల్లా విష్ణుచక్రపురంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఏడాది పొడవునా పైపూతగా ఉండే చందన సమర్పణకు మహారాష్ట్రకు చెందిన గుబ్బి సివిల్ ఇంజినీరింగ్ కంపెనీ యాజమాన్యం, సిబ్బంది రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ ఏఈఓ ఆనందకుమార్‌కు బుధవారం వారు అందజేశారు. అధికారులు ఆలయ ఆచారం ప్రకారం దాతలకు అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

'పింఛన్ పెంచాలి'

తగరపువలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం కార్మికులు ఎదుర్కొంటున్న పింఛన్ సమస్య కూడా పరిష్కరించకపోవడం విచారకరమని చిట్టివలస జూట్‌మిల్లు పెన్షనర్స్ సంఘం నాయకుడు కానూరి రాంబాబు అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన తగరపువలస మెయిన్ రోడ్‌లో వున్న జీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పని చేసిన 80 లక్షల మంది పింఛన్‌దారులకు బడ్జెట్‌లో పింఛన్ మొత్తాన్ని పెంపుదల చేస్తే ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు, చిట్టివలస జూట్‌మిల్లు పింఛనుదారులు పాల్గొన్నారు.

సింహగిరిపై అన్యమత ప్రచారం

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంలో అన్యమత ప్రచారం యథేచ్ఛగా జరుగుతుందని బీజేపీ ఆధ్యాత్మిక విభాగం ప్రతినిధి కందాళ ఫణి ఆరోపించారు. బుధవారం సింహగిరిపై పడమటి మాడవీధిలో నిలిపి ఉన్న కారు మీద అన్యమత ప్రచార రాతలు ఉండడంతో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలు సింహగిరి టోల్‌గేట్ వద్ద పని చేసే సిబ్బంది కాని, కార్ల పార్కింగ్ వద్ద పనిచేసే గార్డులు కాని పెద్ద అక్షరాలున్న రాతలను కనీసం చూడకపోవడం గమనార్హమన్నారు.

ల్యాండ్ పూలింగ్ భూములపై దర్యాప్తు

నేరేళ్లవలసలో రైతులను విచారించిన విజిలెన్స్ అధికారులు

పద్మనాభం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేళ్లవలసలో ల్యాండ్ పూలింగ్ భూముల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ అధికారులు బుధవారం దర్యాప్తు చేపట్టారు. గ్రామాన్ని సందర్శించి, రైతులతో నేరుగా మాట్లాడారు. తునివలస, నేరేళ్లవలస గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ల్యాండ్ పూలింగ్ భూముల సేకరణలో అనేక అవకతవకలు జరిగాయని,ఈ వ్యవహారంలో ఆ పార్టీ నాయకులు పేదలను భయపెట్టి ల్యాండ్ పూలింగ్ భూములకు పరిహారంగా వచ్చిన ప్లాట్లును వారి పేరున బదలాయించుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాల వచ్చాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం ల్యాండ్



నేరేళ్లవలసలో రైతును విచారిస్తున్న అధికారి

పూలింగ్ భూముల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్సు దర్యాప్తునకు ఆదేశించడంతో మూడు రోజులుగా నర్సాపురం, తునివలస, నేరేళ్లవలస గ్రామాల్లో అధికారులు విచారణ చేపడుతున్నారు. భూములిచ్చిన రైతుల వద్దకు వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. రైతులు కోల్పోయిన భూమి, అందుకు వారికి పరిహారంగా వచ్చిన ప్లాట్ల వివరాలు, వాటిని కొనుగోలు చేసిన వారి వివరాలను కూడా దర్యాప్తులో భాగంగా సేకరించారు.ప్లాట్లు బలవంతంగా రాయించుకున్న వైసీపీ నాయకులు రైతులకు నగదు చెల్లింపు చేసారా, లేదా అన్న విషయంపై కూడా రైతుల నుంచి వివరాలు సేకరించారు. తమకు వచ్చిన ప్లాట్లను స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. గిరిబాబు రాయించుకున్నా తమకు పూర్తి చెల్లింపులు చేయలేదని పలువురు రైతులు అధికారుల దర్యాప్తులో చెప్పినట్టు సమాచారం. రైతుల నుంచి ప్లాట్లు కొనుగోలు చేసిన జెడ్పీటీసీ సభ్యునితో పాటు ఒక కాంట్రాక్టర్‌ను కూడా విజిలెన్సు అధికారులు విచారించినట్టు తెలిసింది. కాగా నేరేళ్లవలస, తునివలస గ్రామాల్లో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఫ్లాట్ల రిజిస్ట్రేషనును కూడా ప్రభుత్వం నిలిపివేసినట్టు తెలిసింది. దీనిపై తహసీల్దారు ఆనందరావును సంప్రతించగా గ్రామాల్లో విజిలెన్సు దర్యాప్తు వాస్తవమేనన్నారు.

విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులు కీలకం

జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. చంద్రశేఖరరావు అన్నారు. బుధవారం ఆయన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత ఎలా సాధించాలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు సూచనలు అందించారు. విద్యార్థులకు పరీక్షల పట్ల భయం పోగొట్టి వారు పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి



కొమ్మాది : విద్యార్థినితో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

తప్పులు చేయకూడదో వివరించాలని చెప్పారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి, పి. దేవుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని మంగమారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఒత్తిడికి గురవ్వకుండా పట్టుదలతో చదవాలని సూచించారు. వంద రోజుల ప్రణాళిక అమలు విషయమై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయనతో హెచ్‌ఎం భాను ఉన్నారు.

వుడా కాలనీ రోడ్డులో ఆక్రమణలు

మధురవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మిథిలాపురి వుడా కాలనీ వంద అడుగుల రహదారిలో ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. అసలే ఈ రోడ్డు ఇరుకు, దానికితోడు ఇరువైపులా ఆక్రమణల వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గాంధీ బొమ్మ సెంటరు నుంచి రహదారికి ఇరువైపులా దుకాణాలు పెరిగిపోయాయి. కొంతమంది స్థలాలను ఆక్రమించి వాటిని వేరొకరికి అద్దెకు ఇస్తున్న కూడా ఉన్నాయి. ఇటీవల కాలనీలో ఈ విషయమై వివాదం జరిగింది. ఆక్రమణలు పెచ్చుమీరడంతో స్థలాలు కోసం ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు. ఇది చివరకు శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు అక్రమంగా



రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు

దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిలోని సామగ్రిని రోడ్డుపై ఉంచుతున్నారు. దుకాణాలకు వస్తున్నకొనుగోలుదారులు కూడా తమ వాహనాలను రహదారిపై నిలిపివేస్తున్నారు. వీటి వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. జీవీఎంసీ, పోలీసులు ఈ సమస్యపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



మధురవాడలో ఒకవైపు పడిపోయిన పలక



కారుషెడ్ సమీపంలో దుస్థితి

ఫుట్‌పాత్‌లపై ప్రమాదకరంగా పలకలు

మధురవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు కారుషెడ్ కూడలి నుంచి మధురవాడ వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న పలకలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల పలకలు విరిగి కాలువలోకి పడిపోగా మరికొన్నిచోట్ల అసలు పలకలు లేవు. దీంతో ఫుట్‌పాత్‌లపై వెళుతున్న పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు నిత్యం వీటిని చూస్తున్నా.. కనీసం స్పందించడం లేదు. చంద్రంపాలెం, కారుషెడ్ కూడలి, మధురవాడ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న కాలువల్లో పూడికలు కూడా తీయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

తగరపువలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపిందని సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి విమర్శించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ..సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు, పేద మధ్య తరగతి ప్రజలకు నష్టం కలిగించేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి, సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా కుదించి బిల్లు పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అనంతరం జంక్షన్‌లో కార్మికులకు, పేదలకు నష్టం చేకూర్చే జీవోలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీటూ నాయకులు ఎస్. అప్పలనాయుడు, రాము, ఎం. ఈశ్వరరావు, సూర్యారావు, ఆర్.నరసింగరావు, పి. రమణ, కొత్తరెడ్డి పాల్గొన్నారు.

గాయత్రిలో కొనసాగుతున్న చాగంటి ప్రవచనాలు

కొమ్మాది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : భరతుడు ఆదర్శవంతమైన నడవడిక కలిగిన సత్పురుషుడు అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా బుధవారం ఆయన అయోధ్య కాండ గురించి వివరించారు. తాను తప్పుచేయకపోయినా అందరూ తనని నిందించినా ధర్మాచరణ పట్ల నిబద్ధత కలిగి శ్రీరాముడు పట్ల గౌరవం, భక్తి, ప్రేమ కలిగిన ఆదర్శమూర్తి భరతుడు అని కొనియాడారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం

పద్మనాభం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన పనులను పూర్తి చేయడంపై దృష్టిసారించాలని ఎంపీడీఓ ఎం.విజయ కుమార్ చెప్పారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు వారి బ్యాంకు ఖాతాలను ఎన్‌సీపీఐతో అనుసంధానం చేయించాలన్నారు. అలాగే ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేయడంతో పాటు పీపీసీఎస్‌ల్లో సభ్యులను గుర్తించడం, సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలించడం, ఎంఎస్‌ఎంఈ సర్వేను పూర్తి చేయడం వంటి పనులను పూర్తి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమార్

బీచ్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

భీమునిపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో ఎర్రమట్టిదిబ్బల సమీపంలో ఉన్న మార్లిన్ కే రెస్టారెంట్ మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు బుధవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ మలుపులో ఎందరో వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు.ఈమేరకు భీమిలి ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా స్పీడ్ బ్రేకర్లు వేయించారు. అలాగే మలుపు వద్ద హెచ్చరిక బోర్డు కూడా అమర్చారు.

'ఉదయం' పోర్టల్ ప్రారంభం

కొమ్మాది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చిరు వ్యాపారులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉదయం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు ఇవ్వనుంది. ఆసక్తి గల వారు పోర్టల్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే బ్యాంకులు అవసరమైన రుణాలు అందిస్తాయి. అలాగే పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం వర్క్‌షాపులు కూ డా నిర్వహిస్తుంది. ఈమేరకు జోన్-2 కార్యాలయంలో మొదటిసారిగా బుధవారం పేర్లు నమోదు ప్రక్రియ చేపట్టారు. వచ్చే నెల 5న రెండవసారి, 22న మూడవసారి నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

'ప్రభుత్వ బడులను కాపాడుకుందాం'

తగరపువలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం రాత్రి ఆయన చిట్టివలస సీఐటీయూ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓ వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ నాశనం కాగా కూటమి ప్రభుత్వం కూడా ఆదర్శ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీనపరిచే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పేద విద్యార్థులను ప్రభుత్వ బడులకు దూరం చేసే ప్రయత్నాలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అడ్డుకోవాలని అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ఎ. పైడిరాజు, కార్యదర్శి రాము పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తగరపువలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డైట్ కళాశాల అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు అన్నారు. బుధవారం ఆయన చిట్టివలసలోని విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన బోధనా సామగ్రిని పరిశీలించారు. అలాగే ఉపాధ్యాయుల డైరీ, పాఠ్య ప్రణాళిక, టీచింగ్ నోట్స్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

రిలే దీక్ష విరమణ

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఉన్న కల్యాణ మండపాల వేలం విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని దేవస్థానం ఏఈఓ నక్కాన ఆనందకుమార్ తెలిపారు. కల్యాణ మండపాల వేలం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల జేఏసీ చేపట్టిన రిలే దీక్ష బుధవారం విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య భక్తులపై ఆర్థిక భారం ఉండకుండా తగిన ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.

రైల్వే డివిజన్ కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేశారు. వాల్తేరు డివిజన్‌లో కీలకమైన, అధిక ఆదాయం సాధించే రైలు మార్గాలను కలపనున్నట్టు ప్రచారం మొదలైంది. వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కిరండూల్ లైన్ చాలా ప్రత్యేకం. భైలదిల్లా నుంచి ముడిఇనుము భారీగా రవాణా జరుగుతోంది. దీని ద్వారానే డివిజన్‌కు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. దానిని రాయగడ డివిజన్‌లో కలిపేస్తారని ప్రచారం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటన్నింటిపై కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఈ ప్రాంత ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, తదితరులు ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోను వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాల్సిందేనని, రద్దు చేస్తే ప్రజలకు సమాధానం చెప్పుకోలేమని వివరించారు. దీనికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొంత సానుకూలంగా స్పందించారు. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన రెండో రోజే జనవరి 10వ తేదీనే ఈ ఫైల్‌కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపేలా చేశారు. అయితే 'వాల్తేరు' పేరుకు బదులుగా 'విశాఖపట్నం' అని వ్యవహరిస్తామని పేర్కొన్నారు. జోన్ ప్రకటనకు ముందుగా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు వాల్తేరు డివిజన్ నుంచి 680 కి.మీ. రైలు మార్గాలను తీసుకువెళ్లి రాయగడ డివిజన్‌లో కలిపేశారు. మిగిలిన 410 కి.మీ.తో విశాఖపట్నం డివిజన్ కొనసాగుతుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇందులో ముఖ్యంగా సంతోషకరమైన విషయం ఏమిటంటే..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను కూడా తీసుకువచ్చి విశాఖ కేంద్రంగా నడిచే 'దక్షిణ కోస్తా జోన్'లో కలిపారు. దీని వల్ల దాదాపు రాష్ట్రం అంతటికీ ఒకే జోన్, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారింది.

చేయాల్సినవి చాలా ఉన్నాయి

ఇల్లు అలకగానే సంబరం కాదన్నట్టుగా జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసి, డివిజన్ పేరు మారిస్తే సరిపోదు. చేయాల్సినవి చాలా ఉన్నాయి. కార్యాలయానికి శంకుస్థాపన జరిగినా ఇప్పటివరకూ ఒక్క పని మొదలు కాలేదు. ఆ నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. అలాగే ప్రత్యేక అధికారిని నియమించి, ఇక్కడి వ్యవహారాలు చకచకా ముందుకు నడిపించాలి. జోన్ కేంద్రానికి ఏమేమి అవసరమో..అన్నీ ఒక్కొక్కటి త్వరగా వచ్చేలా చూడాలి. రాయగడ డివిజన్‌కు అవసరమైన సిబ్బందిని ఎలాగైతే ఇక్కడి నుంచి పంపించేస్తున్నారో.. జోన్ కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని కూడా రప్పించాలి. అప్పుడే మిగిలిన జోన్లతో దక్షిణ కోస్తా కూడా పోటీ పడుతుంది.

ఉద్యోగులకు నష్టం లేకుండా చూస్తాం

గాంధీ, రైల్వే యూనియన్ నాయకులు

డివిజన్ల పునర్విభజన వల్ల రైల్వే ఉద్యోగులకు ఎటువంటి నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపడతాం. ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం. తక్షణమే జోనల్ మేనేజర్‌ను నియమించాలి. అందుబాటులో ఉన్న భవనాల్లో కార్యాలయాలు నడపాలి.

పూర్ణామార్కెట్‌లో ఆశీల్ కాంట్రాక్టర్ దందా

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు కేటాయించిన రోడ్డుకు ఇరువైపులా జంగిడీలతో వ్యాపారం చేసు కునేందుకు కాంట్రాక్టర్ సహకరిస్తున్నారు. కొనుగోలుదారులు మార్కెట్‌లోకి వెళ్లకుండా రోడ్డుపక్కనే ఉన్న దుకాణాల్లో కొనడానికి ఆసక్తి చూపుతుండడంతో అక్కడ వ్యాపారం బాగా సాగుతోంది. దాంతో లోపల దుకాణాలు ఉన్నవారే తమ కుటుంబ సభ్యులు లేదంటే కూలీలతో బయట జంగిడీలు పెట్టించేస్తున్నారు. మార్కెట్ లోపల పక్కా దుకాణాలకు రోజుకు రూ.25 నుంచి రూ.35 ఆశీల్ వసూలు చేస్తే, బయట చిన్న పాటి జంగిడీ (తట్ట) పెట్టుకుని వ్యాపారం చేసేవారి నుంచి రూ.250వసూలు చేస్తుండడం విశేషం. ఆశీల్ రూపేణా భారీగా ఆదాయం వస్తుండడంతో పార్కింగ్‌కు కేటాయించిన రోడ్డుకు ఇరువైపులా రెండు, మూడు వరుసల్లో జంగిడీలు పెట్టిస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌కు వచ్చే వారికి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు చోటు ఉండడం లేదు. మార్కెట్‌కు ఎదురుగా వున్న దుకాణాల ముందు కూడా వాహనాల పార్కింగ్‌కు చోటులేకుండా జంగిడీలను పెట్టేస్తుండడంతో వారంతా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ పోలీసులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

సరకు వాహనాల నుంచి భారీగా వసూళ్లు

పూర్ణామార్కెట్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి సరుకులు తీసుకొచ్చే వాహనాల నుంచి భారీగా ఆశీల్ వసూలు చేస్తున్నారు. మార్కెట్‌కు సరకులోడుతో లారీ వస్తే గెజిట్ రేటు ప్రకారం రూ.125 ఆశీల్ వసూలుచేయాలి. కానీ ఏకంగా రూ.500 వసూలు చేస్తున్నారు. అదే సగంలోడుతో వచ్చే లారీ నుంచి గెజిట్ ప్రకారం రూ.75 ఆశీల్ వసూలు చేయాల్సి ఉండగా రూ.300 వసూలు చేస్తున్నారు. మినీ వ్యాన్/ట్రాక్టర్‌కు గెజిట్ రేటు ప్రకారం రూ.75 వసూలుచేయాల్సి ఉండగా రూ.250 వసూలు చేస్తున్నారు. గూడ్స్ ఆటోకి రూ.25 వసూలు చేయాల్సి ఉంటే రూ.150 వసూలు చేస్తున్నారు. మార్కెట్ నుంచి సరకు తీసుకువెళ్లేందుకు వచ్చే వాహనాల నుంచి కూడా కేటగిరీని బట్టి అదే మాదిరిగా ఆశీల్ వసూలు చేస్తున్నారు. మార్కెట్‌కు సమీపంలోగాని, చుట్టుపక్కల రోడ్లపై గానీ ఎవరైనా తోపుడు బండి పెట్టుకుంటే గెజిట్ ప్రకారం ఆశీలు కింద రూ.పది వసూలు చేయాలి. కానీ ఒక్కో తోపుడు బండి నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు

గెజిట్ ప్రకారమే ఆశీలు వసూలు చేసేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులదే అయినప్పటికీ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గెజిట్‌ను ఉల్లంఘించి ఆశీలు వసూలుచేస్తే టెండర్ రద్దు చేసే అధికారం జీవీఎంసీకి ఉంటుందని వేలం వేసినప్పుడే అధికారులు స్పష్టంగా చెబుతారు. దానికి పాటదారుడు అంగీకరిస్తూ సంతకం చేస్తారు. అయితే గెజిట్ కంటే పది రెట్లకుపైగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాసరే జోన్-4 అధికారులు మాత్రం ఎందుచేతనోగానీ చర్యలకు వెనుకాడుతున్నారు. పైగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం చేరవేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ దృష్టిసారించాలని వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిర్వహణకు ఏఐ

... 5వ పేజీ తరువాయి

పాల్పడుతున్నారు. రాంగ్ రూట్‌లో రావడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే రహదారి పొడవునా పోలీసులను నిరంతరం ఉంచడం సాధ్యమయ్యేపనికాదు కాబట్టి, టెక్నాలజీ ఆధారంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి చెక్ పెట్టాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. అందులో భాగంగా కూడళ్లలో సిగ్నల్స్ సీసీ కెమెరాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పనిచేసే ఏర్పాటుచేయాలని జీవీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి కూడలిలోనూ ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే వాహనాల రద్దీని బట్టి సిగ్నల్స్ ఆటోమేటిక్‌గా మారిపోతాయి. ఒకచోట గ్రీన్‌సిగ్నల్ వస్తే..అక్కడి నుంచి వాహనం ముందు జంక్షన్‌కు వెళ్లేసరికి అక్కడ కూడా గ్రీన్‌సిగ్నల్ ఉండేలా సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు సిగ్నల్స్ జంపింగ్ చేయాల్సిన అవసరం వాహన చోదకులకు ఉండదు. అలాగే ఎవరైనా వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతున్నా, హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే..సీసీ కెమెరాలు ఆటోమేటిక్‌గా ఉల్లంఘనను గుర్తిస్తాయి. వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా వాహన యజమానికి ఈ-చలాన్ జారీ అయిపోతోంది. అలాగే పాత నేరస్థులు, తరచూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడం, వాహనాలను అతివేగంగా నడపడం వంటి చర్యలకు పాల్పడేవారిని ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు ఫేషియల్ రికగ్నైజేషన్‌ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌లో గుర్తించి, వారి పేరు, చిరునామా, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను కంట్రోల్‌రూమ్‌కు చేరవేస్తాయి. తద్వారా అలాంటి వారిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోవడం సులభమవుతుంది. ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ పోలీసులకు పెద్దగా పని ఉండదు. కేవలం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడం, పెండింగ్ చలాన్‌లను కట్టించేలా చేయడం వంటి పనులు మాత్రమే నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనివల్ల ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందిని తగ్గించి ఇతర విధులకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది. సీపీ శంఖబ్రతబాగ్చి విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారులు 101 కూడళ్లలో ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో జంక్షన్‌లో ఎన్ని కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, దానికి ఎంత ఖర్చవుతుందనే దానిపై అంచనాలను తయారుచేస్తున్నారు.

ప్రతిపాదనలు తయారీకి సంబంధించి కొన్నాళ్ల కిందటే జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో ఇంజనీరింగ్ అధికారులు వేగంగా అంచనాలను తయారుచేసే పనిలో పడ్డారు. అంచనాలు తయారైతే తిరిగి కౌన్సిల్ ఆమోదంతో టెండర్లు పిలవాల్సి ఉంటుంది.

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్‌టికెట్లు

... 5వ పేజీ తరువాయి

తరువాత వాట్సాప్‌కు పంపే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ...

75 శాతం హాజరు లేకుంటే జరిమానా చెల్లించాలనే నిబంధనను కూడా రద్దు చేశారు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్లు జారీ చేయాలని ఈనెల నాలుగో తేదీన ఇంటర్ బోర్డుకు ప్రత్యేక ఆదేశాలు వచ్చాయి. ఫీజు బకాయిలు, హాజరు శాతం, ఫైన్లతో పని లేకుండా విద్యార్థి వాట్సాప్ నంబరు సేకరించి హాల్ టికెట్‌ను పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో 75 శాతం కంటే తక్కువ హాజరు కలిగిన విద్యార్థుల నుంచి వసూలుచేసిన ఫైన్‌ను ఆయా కళాశాలల యాజమాన్యాలు తిరిగి చెల్లిస్తున్నాయి.

అదనపు కమిషనర్ అడ్డగోలు వసూళ్లు!

... 5వ పేజీ తరువాయి

నిలదీయడంతోపాటు కమీషన్ విషయాన్ని మీడియాకు చెబుతానని బెదిరించడంతో అతనికి మాత్రమే మినహాయింపు ఇచ్చి,మిగిలినవారి నుంచి వసూలు చేస్తున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కమీషన్ ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే బిల్లులు రాకుండా చేస్తారనే భయంతో అదనపు కమిషనర్‌కు కమీషన్ ఇచ్చేందుకు ఒప్పుకుంటున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్ ఈ వ్యవహారంపై దృష్టిసారించి సదరు అధికారికి చెక్ పెట్టాలని కోరుతున్నారు.

ఏపీ మహిళా సమాఖ్య నిరసన

గాజువాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, దళిత యువతులు, మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో పాలక పక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు బుధవారం పాత గాజువాకలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువతులపై లైంగిక దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తే మరొకరు అలాంటి ఘటనలకు పాల్పడేందుకు భయపడతారన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు పద్మ, దేవుడమ్మ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

అగనంపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత చదువుల గురించి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి అఫ్షా ఖాజీ, రోచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి జినియా మల్లిక్, షోర్‌లైట్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ నుంచి మెర్సీపాల్, తదితరులు పాల్గొని విద్యార్థులకు విదేశీ విద్య, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అడ్మిషన్ ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లతో పాటు సంబంధిత విద్యా సంస్థల్లో చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అఖిలపక్షం ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, రైతు, యువజన వ్యతిరేక బడ్జెట్‌ను అందరూ ఖండించాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన ధర్నాలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గంపై కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. దేశానికి వెన్నుముఖ అయిన రైతులను కూడా నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించబోమని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, వైటీ దాస్, యు.రామస్వామి, డి.సురేశ్ బాబు, పీవీ రమణమూర్తి, జి.గణపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

అగనంపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల ఎనిమిదిన భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం జనసేన నాయకుడు విందుల వెంకటరమణ ఆవిష్కరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఎనిమిదో తేదీన ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **మహిష :** రమాదేవి

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 13, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 100, అల్లం 44, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 30, దోసకాయలు 26, వెల్లుల్లి 160, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 38, కీరదోస 32, కాప్సికమ్ 42, పొట్లకాయ 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 56, దేముడుచిక్కుడు 32, గోరుచిక్కుడు 26, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట)4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడిఅల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

జీతాలు లేక.. మీల్ కార్డుల్లో నగదు జమ కాక..

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వేతనాల సంగతిని పక్కన పెడితే వారి జీతాల్లో కోత విధించిన మీల్ కార్డు నగదు కూడా అందకపోకవడంతో ఉద్యోగులు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉద్యోగులకు ఉక్కు యాజమాన్యం ఏడేళ్ల క్రితం మీల్ కార్డులను అందజేసింది. దీని ఉద్దేశం ఏమిటంటే.. ఉద్యోగుల వేతనాల నుంచి కొంత నగదును మినహాయించడంతో పాటు వారికి ఇవ్వాల్సిన క్యాంటీన్ అలవెన్స్‌లను కలిపి రోజుకు వంద రూపాయల చొప్పున ఉద్యోగుల మీల్ కార్డులో యాజమాన్యం జమ చేసేది. వారు విధులకు హాజరైన ఒక్కో రోజుకు గాను వంద రూపాయల చొప్పున నెలకు సుమారు రూ.2,400 జమ చేసేది. అయితే గడిచిన ఆరు నెలలుగా ఉద్యోగుల మీల్ కార్డుల్లో నగదు జమ కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఉక్కు ఉద్యోగులు

ప్లాంట్ యాజమాన్యం ఆదుకోవాలని వేడుకోలు

తమకు ఇచ్చిన పే స్లిప్‌ల్లో మాత్రం నగదు మినహాయింపు అయినట్టు చూపిస్తున్నా.. దానిని మీల్ కార్డుల్లో జమ చేయడం లేదని వాపోతున్నారు.

ఈ కార్డు ద్వారా ఉద్యోగులు పలు దుకాణాల్లో నిత్యావసర సరకులు మాత్రమే కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఒకపక్క వేతనాలు చెల్లించకపోవడంతో పాటు కనీసం నిత్యావసర సరకులు కొనుగోలు చేసుకుందామన్నా మీల్ కార్డుల్లో నగదు జమ చేయకపోవడం ఎంతవరకు సమంజసమని పలువురు ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. మీల్ కార్డుల్లో నగదు జమ అయితే కనీసం కుటుంబాలను పోషించుకునేందుకు నిత్యావసర సరకులనైనా కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉండేదని పేర్కొంటున్నారు. ఉద్యోగుల కనీస అవసరాలు తీర్చుకునేందుకు గాను ఉక్కు యాజమాన్యం మీల్ కార్డుల్లో తమ జీతాల్లో కట్ చేసిన నగదును జమ చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

మంచు కురిసే వేళలో..



అప్పికొండ గ్రామంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో..

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 77వ వార్డు పరిధి అప్పికొండ, ఇస్లాంపేట, స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గం, తదితర ప్రాంతాల్లో బుధవారం దట్టంగా మంచు కురిసింది. ఉదయం 7.30 గంటలు దాటినా ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు, పాదచారులు స్వల్ప ఇబ్బందులకు గురయ్యారు. మన్యం ప్రాంతాలను తలపించేలా దట్టంగా పొగమంచు కురవడంతో వృద్ధులు బయటకు వచ్చేందుకే సాహసించలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంత వరకు కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులందరూ హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. రూరల్ ప్రాంతం నుంచి ఉక్కు కర్మాగారానికి వచ్చే బస్సులు చాలా ఆలస్యంగా నడిచాయి.

పెన్షనర్ల నిరసనను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్-95 పెన్షనర్ల జిల్లా అసోసియేషన్ ఈ నెల 11, 12 తేదీల్లో జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామారావు కోరారు. ఇక్కడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో బుధవారం ఈపీఎఫ్-95 పెన్షనర్ల జిల్లా అసోసియేషన్ పారిశ్రామిక ప్రాంత శాఖ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెన్షనర్లకు మొండిచేయి చూపారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్‌గా రూ.9,000 ఇవ్వాలని డిమాండ్ చేసినా దాని గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పెన్షనర్లకు ఉచిత మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైల్వే చార్జీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కణితి అప్పలరాజు, కిల్లి దీనబంధు, నమ్మి అప్పలనాయుడు, వెంకటరావు, సింహాచలం, సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.రామారావు

ఘనంగా పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం

పెందుర్తిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు చీమలాపల్లి పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రేళ్ల పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అయితా ఎర్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటరు ముమ్మన దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అయితా ఎర్రయ్య, పరదేశి, విశ్వేశ్వరరావు, దువ్వి అప్పారావు, సంతోష్, మాజీ సర్పంచి ఆళ్ల తాతారావు, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పైడిమాంబను దర్శించుకున్న నాయకులు

నేటి నుంచి భూలోకమాంబకు పూజలు

వేపగుంట: అప్పన్నపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం శ్రీ భూలోకమాంబ ఆలయం పునఃప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 6 నుంచి 8 వరకు జరుగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు. 6న ఉదయం 7 గంటలకు గ్రామ పురవీధుల నుంచి జలాలను తీసుకురావడం, 9 గంటల నుంచి ప్రతిష్ఠాతీర్థ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం పరిషత్తు, కృచ్ఛత్రయం, దీక్షాధారణ, యాగశాల పూజప్రవేశం, వేదికాకుండల సంస్కారములు, అఖండదీప స్థాపన, వేదగోష్టి తదితర పూజలు, 7న ఉదయం 8 నుంచి రాత్రి 9వరకు ప్రాతరౌపాశన, చతుర్వేద పారాయణ, అవాహనదేవత అర్చన, సుర్యనమస్కారాలు, మహాలింగార్చన,మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, హోమాలు, సాయంత్రం మహిళలతో కుంకుమార్చన పూజలు చేయనున్నారు. 8న ఉదయం 7 గంటలకు విగ్రహ శిఖర ప్రతిష్ట అనంతరం కళాన్యాస హోమం, శీఘ్ర దర్శనాలు కల్పించనున్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం తీర్థ మహోత్సవం జరుగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన

గోపాలపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమని బెహరా నర్సింగ్ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ హిందుమతి అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలను ఎలా గుర్తించాలి, ప్రాథమిక స్థితిలో ఉంటే ఎలాంటి చికిత్స తీసుకోవాలో వివరించారు. అనంతరం నర్సింగ్ కళాశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్స్ అనూష ప్రియ, దివ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శన

విద్యార్థిని దివ్యశ్రీకి అభినందనలు

మల్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల వలంటీరు పోలిమేర దివ్యశ్రీని బుధవారం కళాశాల అధ్యాపక బృందం సత్కరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ దివ్యశ్రీ రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని ప్రధాని, రాష్ట్రపతి ప్రశంసలు పొంది కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిందన్నారు. అనంతరం దివ్యశ్రీ మాట్లాడుతూ తనకు ఇంత పెద్ద అవకాశాన్ని ఇచ్చిన జాతీయ సేవా పథకం, ఏయూ అధికారులకు, కళాశాల యజమాన్యానికి , అధ్యాపకులకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయదేవి, అంజలిదేవీ, నదియా, సంధ్యారాణి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

మిండి హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ



ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అగ్ని ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాలను అరికట్టడంతో పాటు వాటి నుంచి ఎలా రక్షణ పొందాలో అవగాహన కలిగి ఉండాలని మిండి హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ ఆంజనేయ అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మిండి హైస్కూల్ విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలతో పాటు గ్యాస్ ప్రమాదాలను ఏ విధంగా అరికట్టాలనే అంశాలను మాక్ డ్రిల్ చేసి చూపించారు.



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న నేతలు

నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

మల్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ బుధవారం ఉదయం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మల్కాపురం జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను నష్టపరిచేలా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రవేశపెడుతున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దుచేయాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులను కేటాయించాలని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చేయాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నరేష్, గంగాధర్, ఎస్.వాసు, బి.శ్రీను, బుజ్జి, కె.రాము, గణేష్, శంకర్, ఇంటక్ నాయకులు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం: బ్రిటీష్ కాలం నాటి నాలుగు కార్మిక చట్టాలను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశంలో అమలు చేసి కార్మికలోకాన్ని బానిసలుగా మార్చేందుకు యత్నించడం సిగ్గుచేటని భెల్ హెచ్‌పీవీపీ పరిరక్షణ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను నిరసిస్తూ భెల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సంస్థ మెయిన్ గేటు వద్ద కార్మికులు నిరసన తెలిపారు. గుర్తింపు యూనియన్ నాయకుడు పీవీఎన్ రాజు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా పార్టీలకు అతీతంగా ఉద్యమిస్తేనే విజయం సాధించగలమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి దేముడు, సనపల జగన్నాథరావు, వారాడ ఆనందరావు, సీతంనాయుడు, జి.చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించేశారని పోలీసులకు ఫిర్యాదు

ఎన్ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ సీజీఎమ్ వైఖరితో సస్పెండైన 36 మంది ఉద్యోగుల సత్యాగ్రహ దీక్షా శిబిరం వద్ద ఫెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. దీనిపై యూనియన్ సభ్యులు బుధవారం ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగులను అకారణంగా సస్పెండ్ చేశారంటూ గత 77 రోజులుగా కేవీ స్కూల్ ఎదురుగా సత్యాగ్రహ దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం కార్మికులు శిబిరం వద్దకు వచ్చేసరికి ఫ్లెక్సీలు చించివేసి, సామగ్రి చిందరవందర చేయడం గమనించారు. యూనియాన్ నాయకులు రెడ్డి వెంకట్రావు, కేవీ థామస్, సునీల్‌కుమార్, పీఏ రాజు, శ్రీనివాస్ తదితరులు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇటువంటి సంఘటనతో కార్మిక ఐక్య పోరాటాలను నీరుగార్చలేరన్నారు.



మెప్మా ఉద్యోగులతో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

'పల్లా'ను కలిసిన మెప్మా ఉద్యోగులు

గాజువాక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు జీవీఎంసీ ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును వారు కోరారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఆర్పీలను తొలగిస్తున్నట్టు వస్తున్న ఆరోపణలపై తామంతా ఆందోళన చెందుతున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని పల్లాకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్పీలను తొలగించే ప్రక్రియ ఏమీ లేదని, ఎవరూ ఎటువంటి అపోహలను నమ్మవద్దన్నారు. పల్లాను కలిసిన వారిలో మెప్మా ఆర్పీలు మల్లీశ్వరి, సత్య, వరలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రికార్డు స్థాయిలో ఎగుమతులు

వీఎస్ఈజడ్ జోనల్ డీసీ ముప్పాళ్ల శ్రీనివాస్



కూర్మన్నపాలెం,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ వీఎస్ఈజెడ్ ద్వారా మూడవ త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఎగుమతులు సాధించినట్టు వీఎస్ఈజడ్ దువ్వాడ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. వీఎస్ఈజడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో 2024 అక్టోబరు నుంచి డిసెంబరు నెలాఖరు నాటికి ఈ ఘనత సాధించామన్నారు. సేవా రంగంలో రూ.40,996 కోట్లు, వస్తు రూపంలో రూ.28,737 కోట్ల ఎగుమతులు రాబట్టామన్నారు. కాగా దువ్వాడ సెజ్ పరిధిలో రూ.1,695 కోట్లతో 28 శాతం అంచనాలకు మించి ఎగుమతులు చేయగలిగామన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.7,092 కోట్ల మేరకు వస్తువులు, సేవలను ఎగుమతులు చేపట్టామన్నారు. మొత్తంమీద 24 శాతం లక్ష్యానికి మించి చేరుకున్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీఎస్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల ఏడో తేదీ ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ అడబాల పార్థసారథి, ఏఈ రామకృష్ణలు తెలిపారు. ఈ కారణంగా డ్రైవర్స్ కాలనీ, శ్రీనివాస నగర్, ఎల్‌బీఎస్ నగర్, టీవీఎన్ కాలనీ, తాబేళ్ల కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, పైడన్న గార్డెన్స్, సెలెస్ట్ ఏరియాకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈడీ బీకే నాయుడు తెలిపారు. ఎన్ఏడీ సాకేతపురం, రెల్లివీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

రసాయనాలు లేకుండా పంటలు పండించాలి

మల్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సహజసిద్ధమైన ప్రకృతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించాలని హెచ్‌పీసీఎల్ సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ డి.రిషాటిపే పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో బుధవారం పంటల నిర్వహణపై మాట్లాడారు. ఖాళీ సమయాల్లో దేశీయ విత్తనాలతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించుకోవాలని సూచించారు. వంటింటి వ్యర్థాలను ఎరువులుగా మార్చి ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ టీఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడారు. ప్రకృతి ఆధారంగా దేశీయ విత్తనాలతో పంటలు పండించాలన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మిథనాల్ తరలింపులో జాగ్రత్తలు అవసరం

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏసీ మహేష్‌కుమార్

మల్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మందుల తయారీ కంపెనీలో ఉపయోగించే మిథనాల్‌ను అత్యంత జాగ్రత్తగా తరలించాలని, ఆ మిథనాల్‌ను డ్రైవర్లు బయటకు తీయకూడదని ఒక వేళ తీస్తే అది ప్రమాదానికి దారి తీయవచ్చునని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సీవీ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఈస్ట్ ఇండియా పెట్రోలియం లిమిటెడ్ (ఈఐపీఎల్) కంపెనీలో బుధవారం మిథనాల్ రవాణాపై డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొంతమంది డ్రైవర్లు మిథనాల్‌ను తస్కరించి సారా తయారీ వ్యక్తులకు అందజేస్తున్నారనే సమాచారం ఉందని, ఇలా చేయడం వల్ల ప్రమాదం జరిగితే కళ్లు పోతాయన్నారు. మిథనాల్ రవాణా, భద్రతా సమస్యలు, రసాయనాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరి, టెర్మినల్ అధికారులు జీఎంకేవీకే సుబ్బరాజు, జీఎంఆర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ లైన్ల పనులను పరిశీలించిన సీఎండీ

ఆటోనగర్,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో జరుగుతున్న భూగర్భ విద్యుత్ లైన్ల పనులను బుధవారం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఈ.పృథ్వీరాజ్ పరిశీలించారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా విశాఖ జోన్-2 పరిధిలో ఇటీవలే ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఎండీ అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వినూత్న కార్యక్రమాలకు వేదిక స్టీల్ క్లబ్: అధ్యక్షుడు



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వినూత్న కార్యక్రమాలకు వేదికగా స్టీల్ క్లబ్‌ను నిలిపేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలని క్లబ్ అధ్యక్షుడు ఎం.మధుసూదనరావు కోరారు. క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులకు ఆహ్లాదం అందించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో క్లబ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు వై.రవికుమార్, డి.వేణుగోపాల్, పీఆర్ఎస్ రవి, క.రంగనాథం, ఎం.వెంకటరాజు, బి.వెంకటరమణ, జె.రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా శారదా పీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్రస్వామి సరస్వతి దేవతా మూర్తులకు పూజలు, అభిషేకాలు చేశారు. లోక కల్యాణార్థం రుత్వికులు యాగం నిర్వహించారు. భక్తులు యాగాన్ని తిలకించారు.



క్రీడాకారులు మణికంఠరాజు, శివతో కోచ్ కుమార్

జాతీయ బీచ్ వాలీబాల్ టోర్నీ ఫైనల్స్‌లో ఆంధ్ర

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడలు బీచ్ వాలీ బాల్ టోర్నీలో ఆంధ్ర పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఆంధ్ర 21-12, 19-21, 15-10 స్కోరుతో తెలంగాణపై విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర ఆటగాళ్లు మణికంఠరాజు, ఎస్.శివ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారని, ఏకపక్షంగా సాగిన తొలి సెట్‌లో 21-12 స్కోరుతో సునాయాసంగా గెలుపొందగా రెండో సెట్‌లో స్వల్ప తప్పిదాలతో 19-21 చేజార్చుకున్నారు. కీలకమైన మూడో సెట్‌ను 15-10 స్కోరుతో చేజిక్కుంచుకుని ఫైనల్ బెర్తు ఖరారు చేసుకున్నారని కోచ్ రక్షణకుమార్ తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ఠ చర్యలు



దుకాణాల వద్ద తనిఖీలు చేపడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీ కుమార్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహితంగా నగరంగా విశాఖను తీర్చి దిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని నైట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జీవీ కుమార్ అన్నారు. అక్కయ్యపాలెంలోని వివిధ వాణిజ్య దుకాణాలు, హోటళ్లను బుధవారం ఆయన పరిశీలించి ప్లాస్టిక్ కవర్లు, సంబంధింత వస్తువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాపంగా ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు ఆదేశాలతో ఈ దాడులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్లాస్టిక్ పదార్థాలు విడనాడేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, వెంకటేశ్, మహేశ్, రాజు, శివ, గోవింద్ పాల్గొన్నారు.

నేడు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు గురువారం నుంచి నగరంలో పర్యటించనున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖ చేరుకొని ఈనెల 10 వరకు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఈమేరకు అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సాయి దుర్గా గణపతి ఆలయ వార్షికోత్సవం

అల్లిపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురంలోని వెంకటేశ్వర మెట్టలో సాయి దుర్గా గణపతి ఆలయ 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గణేశ్ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మహాఅన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం, తిరువీధి వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు బి. సుజాత, ఎ. సీతాదేవి, వి. పద్మావతి, బి. విమల, కె. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై అవగాహన

దొండపర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి నెహ్రూ బజారు సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఎర్లీ చైల్డ్ వుడ్ కేర్ ఎడ్యూకేషన్ (ఈసీజీ) డే నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులకు అంగన్వాడీ టీచర్ గజలక్ష్మి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

విశాఖపట్నం డివిజన్ ప్రకటన పట్ల హర్షం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ చరిత కలిగిన వాల్తేర్ రైల్వే డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్ పేరుతో కొనసాగించాలన్న నిర్ణయం కూటమి ప్రభుత్వం సాధించిన మరో విజయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, గుంతుకల్ రైల్వే డివిజన్‌లతో ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ వల్ల రాష్ట్రానికి భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులు, కొత్త రైళ్లు వస్తాయని చెప్పారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్



రైతుబజార్ వద్ద రాకపోకలకు అవకాశం లేకుండా రోడ్డుపై నిలిపిన వాహనాలు

మద్రిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్రిపాలెం రైతుబజార్ వద్ద ప్రధాన రహదారిపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలవడంతో రాకపోకలకు పలువురు ఇబ్బంది పడుతున్నారు. సగానికిపైగా రోడ్డుపైనే వాహనాలు నిలిపి వేస్తుండటంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోందని బజార్‌కు వచ్చేవారు, పాదచారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్ లోపలకు వెళ్లేందుకు అవకాశంలేకుండా ప్రవేశ ద్వారం ఎదుట కూడా పార్కింగ్ చే స్తున్నారని, వాటికితోడుగా జీవీఎంసీ చెత్తడబ్బాలు కూడా రోడ్డుపైనే పెట్టేయడంతో కార్లు, ఆటోలు, ఇతర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాపోతున్నారు. అధికారులు వాహనాలను రోడ్డుపై పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నడక మార్గంలో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమణలు తొలగించిన అనంతరం ఫుట్‌పాత్

కంచరపాలెం, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం మెట్టు వద్ద ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఇక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమణ చేసి వ్యాపారాలు నిర్వహిస్తుండడంపై 'నడక మార్గాలే వ్యాపార కేంద్రాలు' శీర్షికన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ సమస్యపై ఐదో జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు మజ్జి గోవింద్ రాజు, చైతన్య, సత్తిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు.ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని వర్తకులను హెచ్చరించారు. కాగా, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిని సారించి ఎప్పటికప్పుడు తొలగింపు కార్యక్రమాలు చేపడితే సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని స్థానికులు అంటున్నారు.

అమృత భారత్ పనుల పురోగతిపై

డీఆర్ఎం సమీక్ష



పనులు పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్ సాహు, రైల్వే అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే పరిధిలోని బొబ్బిలి స్టేషన్‌లో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు బుధవారం పర్యటించి తనిఖీలు చేపట్టి అమృత భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో 12 మీ. వెడల్పు పాదచారుల వంతెన, స్టేషన్ భవనం మెరుగుదల వంటి వాటిని పరిశీలించారు. అలాగే లెవెల్ క్రాసింగ్ గేట్, బ్రిడ్జిలతోపాటు ప్రయాణికుల మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. బొబ్బిలి, కోమటపల్లి సెక్షన్‌లోని వంతెనపై ఆడిట్ నిర్వహించి అక్కడి గేట్‌మెన్, గ్యాంగ్‌మెన్ సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. కోమటపల్లి స్టేషన్‌లో ప్రయాణికులకు అదనపు సౌకర్యాల ఏర్పాటు, ట్రాక్షన్ సబ్ స్టేషన్ పరిశీలించారు. ఈ పర్యటనలో సేఫ్టీ, సివిల్ ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికాం, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, ఆపరేషన్స్ శాఖలకు చెందిన అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లలితా పీఠంలో రాజశ్యామల హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు లలితానగర్‌లోని లలితా పీఠంలో బుధవారం రాజశ్యామల హోమం జరిగింది. ఈ హోమాన్ని రుత్వికులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి హోమంలో పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతో అభివృద్ధి చేయాలి



నిరసన దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపి, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభ రాజు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట చేపట్టిన నిరసనన దీక్షలు బుధవారంతో 128 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ ఆస్పత్రి 150 పడకల సామర్థ్యంతో నిర్మించారన్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు, డాక్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, రిటైర్ అయిన కార్మికులు, కుటుంబ పెన్షనర్లు, పూల్ కళాసీలకు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబాలకు కొన్ని దశాబ్దాలుగా సేవలు అందిస్తోందన్నారు. అలాంటి పోర్టు ఆసుపత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లెనరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా 300 పడకలతో ప్రైవేటుకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్తే తిరిగి పోర్టు చేతుల్లోకి వచ్చే అవకాశం లేదన్నారు. అప్పుడు వేలాది మంది పోర్టు ఉద్యోగులకు, పెన్షనర్లకు వైద్యం దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, మూర్తి, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతమ్మధార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ కేక్ కట్ చేసి, అభిమానులకు తినిపించారు. జనసేన 27వ వార్డు అధ్యక్షుడు సురేశ్‌బాబు, కార్పొరేటర్ వీరారావు బుజ్జి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు సాయిబాబావీధిలో వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విల్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విల్లూరి చక్రవర్తి, తిరుమాలదేవి పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఎస్కే వరప్రసాద్, బీశెట్టి శ్రీనివాసరావు, గందా సత్య, బాల సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం స్పోర్ట్సు : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కబడ్డీ సంఘం ఘనంగా నిర్వహించింది.శివాజీపార్కు వద్ద గల జనసేన కార్యాలయంలో భారీ కేక్‌ను వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు వి. బాబురావు, పి. దాసు, పివి రమణ, గణపతిరావు, పి. కోటేశ్వర రావు, పి. శివ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలో వసతి కల్పనకు వినతి

మురళీనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో వసతి మెరుగుపరచాలని కోరుతూ హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందించారు. బుధవారం వారు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా పాఠశాలలో వసతి లేదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం చేయడానికి వీలుగా డైనింగ్ హాలు, స్కూల్లో దెబ్బతిన్న ఫర్నీచరు స్థానంలో కొత్త సామగ్రి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభారతి, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్, పి. అప్పారావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలి'

మహారాణిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యువత చైతన్యవంతమైన చిత్రాలను వీక్షించి అందులోని భావాలను తెలుసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. తెలుగు సినిమా దినోత్సవం పురస్కరించుకుని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్‌ను బుధవారం పౌర గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా అభివృద్ధికి దోహదం చేసిన వారిని గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. అంతకముందు పలువురు తొలి తెలుగు టాకీ చిత్రం దర్శకుడు హెచ్ఎం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతమ్మధార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో జరిగిన సమ్మేళనం సభికులను అలరించింది. ఈ సందర్భంగా శేఖరమంత్రి ప్రభాకర్, డాక్టర్ జి. వేణు మాట్లాడుతూ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని, కవి సమాజ శ్రేయోభిలాషి అని తెలిపారు. కార్యక్రమంలో డీవీ సూర్యారావు, సూరేనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వర రావు, పీవీఆర్ కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'నా వాళ్లు, వాళ్ల ఆనవాళ్లు' పుస్తకావిష్కరణ

సీతమ్మధార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ రంచించిన నా వాళ్లు, వాళ్ల ఆనవాళ్లు పుస్తకాన్ని డాక్టర్ మోటూరి రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సితార, డీవీ సూర్యారావు, డీఆర్‌కే రావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కేవీఎస్ మూర్తి, సూర్యనారాయణ, రామకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న పైడా కృష్ణ ప్రసాద్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం పాత జైల్‌రోడ్డులోని పైడా మహిళా డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ విశాఖపట్నం, ఏ.ఎస్.రాజా బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సిబ్బంది సునంది,ఆర్గనైజర్ గీత, రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షుడు ధర్మేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ సరోజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామశేషు, పైడా వుమెన్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కమిషనర్ అడ్డగోలు వసూళ్లు!

... 5వ పేజీ తరువాయి

నిలదీయడంతోపాటు కమీషన్ విషయాన్ని మీడియాకు చెబుతానని బెదిరించడంతో అతనికి మాత్రమే మినహాయింపు ఇచ్చి, మిగిలినవారి నుంచి వసూలు చేస్తున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కమీషన్ ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే బిల్లులు రాకుండా చేస్తారనే భయంతో అదనపు కమిషనర్‌కు కమీషన్ ఇచ్చేందుకు ఒప్పుకుంటున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఈ వ్యవహారంపై దృష్టిసారించి సదరు అధికారికి చెక్ పెట్టాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిర్వహణకు ఏఐ

... 5వ పేజీ తరువాయి

పాల్పడుతున్నారు. రాంగ్ రూట్‌లో రావడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూవాహనాలను నడపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే రహదారి పొడవునా పోలీసులను నిరంతరం ఉంచడం సాధ్యమయ్యేపనికాదు కాబట్టి, టెక్నాలజీ ఆధారంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి చెక్ పెట్టాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. అందులో భాగంగా కూడళ్లలో సిగ్నల్స్, సీసీ కెమెరాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పనిచేసే ఏర్పాటుచేయాలని జీవీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి కూడలిలోనూ ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే వాహనాల రద్దీని బట్టి సిగ్నల్స్ ఆటోమేటిక్‌గా మారిపోతాయి. ఒకచోట గ్రీన్‌సిగ్నల్ వస్తే...అక్కడి నుంచి వాహనం ముందు జంక్షన్‌కు వెళ్లేసరికి అక్కడ కూడా గ్రీన్‌సిగ్నల్ ఉండేలా సిగ్నల్స్ సింక్రనైజేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు సిగ్నల్స్ జంపింగ్ చేయాల్సిన అవసరం వాహన చోదకులకు ఉండదు. అలాగే ఎవరైనా వాహనం నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతున్నా, హెల్మెట్ ధరించకపోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపినా సరే...సీసీ కెమెరాలు ఆటోమేటిక్‌గా ఉల్లంఘనను గుర్తిస్తాయి. వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా వాహన యజమానికి ఈ-చలా న్ జారీ అయిపోతోంది.

అలాగే పాత నేరస్థులు, తరచూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడం, వాహనాలను అతి వేగంగా నడపడం వంటి చర్యలకు పాల్పడేవారిని ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు ఫేషియల్ రికగ్నైజేషన్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌లో గుర్తించి, వారి పేరు, చిరునామా, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను కంట్రోల్‌రూమ్‌కు చేరవేస్తాయి. తద్వారా అలాంటి వారిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోవడం సులభమవుతుంది. ఏఐ టెక్నాలజీ కలిగిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ పోలీసులకు పెద్దగా పని ఉండదు. కేవలం డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడం, పెండింగ్ చలాన్‌లను కట్టించేలా చేయడం వంటి పనులు మాత్రమే నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనివల్ల ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందిని తగ్గించి ఇతర విధులకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది. సీపీ శంఖబ్రతబాగ్చి విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారులు 101 కూడళ్లలో ఏఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో జంక్షన్‌లో ఎన్ని కెమెరాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది, దానికి ఎంత ఖర్చవుతుందనే దానిపై అంచనాలను తయారుచేస్తున్నారు.

ప్రతిపాదనలు తయారీకి సంబంధించి కొన్నాళ్ల కిందటే జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలపడంతో ఇంజనీరింగ్ అధికారులు వేగంగా అంచనాలను తయారుచేసే పనిలో పడ్డారు. అంచనాలు తయారైతే తిరిగి కౌన్సిల్ ఆమోదంతో టెండర్లు పిలవాల్సి ఉంటుంది.

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్‌టికెట్లు

... 5వ పేజీ తరువాయి

తరువాత వాట్సాప్‌కు పంపే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ...

75 శాతం హాజరు లేకుంటే జరిమానా చెల్లించాలనే నిబంధనను కూడా రద్దు చేశారు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్లు జారీ చేయాలని ఈనెల నాలుగో తేదీన ఇంటర్ బోర్డుకు ప్రత్యేక ఆదేశాలు వచ్చాయి. ఫీజు బకాయిలు, హాజరు శాతం , ఫైన్లతో పని లేకుండా విద్యార్థి వాట్సాప్ నంబరు సేకరించి హాల్ టికెట్‌ను పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో 75 శాతం కంటే తక్కువ హాజరు కలిగిన విద్యార్థుల నుంచి వసూలుచేసిన ఫైన్‌ను ఆయా కళాశాలల యాజమాన్యాలు తిరిగి చెల్లిస్తున్నాయి.

పూర్ణామార్కెట్‌లో ఆశీలు కాంట్రాక్టర్ దందా

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు కేటాయించిన రోడ్డుకు ఇరువైపులా జంగిడీలతో వ్యాపారం చేసు కునేందుకు కాంట్రాక్టర్ సహకరిస్తున్నారు. కొనుగోలుదారులు మార్కెట్‌లోకి వెళ్లకుండా రోడ్డుపక్కనే ఉన్న దుకాణాల్లో కొనడానికి ఆసక్తి చూపుతుండడంతో అక్కడ వ్యాపారం బాగా సాగుతోంది. దాంతో లోపల దుకాణాలు ఉన్నవారే తమ కుటుంబ సభ్యులు లేదంటే కూలీలతో బయట జంగిడీలు పెట్టించేస్తున్నారు. మార్కెట్ లోపల పక్కా దుకాణాలకు రోజుకు రూ.25 నుంచి రూ.35 ఆశీలు వసూలుచేస్తే, బయట చిన్నపాటి జంగిడీ (తట్ట) పెట్టుకుని వ్యాపారం చేసేవారి నుంచి రూ.250 వసూలు చేస్తుండడం విశేషం. ఆశీలు రూపేణా భారీగా ఆదాయం వస్తుండడంతో పార్కింగ్‌కు కేటాయించిన రోడ్డుకు ఇరువైపులా రెండు, మూడు వరుసల్లో జంగిడీలు పెట్టిస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌కు వచ్చే వారికి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు చోటు ఉండడం లేదు. మార్కెట్‌కు ఎదురుగా వున్న దుకాణాల ముందు కూడా వాహనాల పార్కింగ్‌కు చోటులేకుండా జంగిడీలను పెట్టేస్తుండడంతో వారంతా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ పోలీసులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

సరకు వాహనాల నుంచి భారీగా వసూళ్లు

పూర్ణామార్కెట్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి సరుకులు తీసుకొచ్చే వాహనాల నుంచి భారీగా ఆశీలు వసూలు చేస్తున్నారు. మార్కెట్‌కు సరకులోడుతో లారీ వస్తే గెజిట్ రేటు ప్రకారం రూ.125 ఆశీలు వసూలుచేయాలి. కానీ ఏకంగా రూ.500 వసూలు చేస్తున్నారు. అదే సగంలోడుతో వచ్చే లారీ నుంచి గెజిట్ ప్రకారం రూ.75 ఆశీలు వసూలుచేయాల్సి ఉండగా రూ.300 వసూలుచేస్తున్నారు. మినీ వ్యాన్/ట్రాక్టర్‌కు గెజిట్ రేటు ప్రకారం రూ.75 వసూలుచేయాల్సి ఉండగా రూ.250 వసూలు చేస్తున్నారు. గూడ్స్ ఆటోకి రూ.25 వసూలు చేయాల్సి ఉంటే రూ.150 వసూలు చేస్తున్నారు. మార్కెట్ నుంచి సరకు తీసుకువెళ్లేందుకు వచ్చే వాహనాల నుంచి కూడా కేటగిరీని బట్టి అదే మాదిరిగా ఆశీలు వసూలు చేస్తున్నారు. మార్కెట్‌కు సమీపంలోగాని, చుట్టుపక్కల రోడ్లపైగానీ ఎవరైనా తోపుడు బండి పెట్టుకుంటే గెజిట్ ప్రకారం ఆశీలు కింద రూ.పది వసూలు చేయాలి. కానీ ఒక్కో తోపుడు బండి నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు

గెజిట్ ప్రకారమే ఆశీలు వసూలు చేసేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులదే అయినప్పటికీ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గెజిట్‌ను ఉల్లంఘించి ఆశీలు వసూలుచేస్తే టెండర్ రద్దు చేసే అధికారం జీవీఎంసీకి ఉంటుందని వేలం వేసినప్పుడే అధికారులు స్పష్టంగా చెబుతారు. దానికి పాటదారుడు అంగీకరిస్తూ సంతకం చేస్తారు. అయితే గెజిట్ కంటే పది రెట్లకుపైగా ఆశీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాసరే జోన్-4 అధికారులు మాత్రం ఎందుచేతనోగానీ చర్యలకు వెనుకాడుతున్నారు. పైగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం చేరవేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దృష్టిసారించాలని వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు కోరుతున్నారు.

రైల్వే డివిజన్ కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. వాల్తేరు డివిజన్‌లో కీలకమైన, అధిక ఆదాయం సాధించే రైలు మార్గాలను కలపనున్నట్టు ప్రచారం మొదలైంది. వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కిరండూల్ లైన్ చాలా ప్రత్యేకం. బైలదిల్లా నుంచి ముడిఇనుము భారీగా రవాణా జరుగుతోంది. దీని ద్వారానే డివిజన్‌కు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. దానిని రాయగడ డివిజన్‌లో కలిపేస్తారని ప్రచారం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటన్నింటిపై కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఈ ప్రాంత ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, తదితరులు ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోను వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాల్సిందేనని, రద్దు చేస్తే ప్రజలకు సమాధానం చెప్పుకోలేమని వివరించారు. దీనికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొంత సానుకూలంగా స్పందించారు. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన రెండో రోజే జనవరి 10వ తేదీనే ఈ ఫైల్‌కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపేలా చేశారు. అయితే 'వాల్తేరు' పేరుకు బదులుగా 'విశాఖపట్నం' అని వ్యవహరిస్తామని పేర్కొన్నారు. జోన్ ప్రకటనకు ముందుగా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు వాల్తేరు డివిజన్ నుంచి 680 కి.మీ. రైలు మార్గాలను తీసుకువెళ్లి రాయగడ డివిజన్‌లో కలిపేశారు. మిగిలిన 410 కి.మీ.తో విశాఖపట్నం డివిజన్ కొనసాగుతుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇందులో ముఖ్యంగా సంతోషకరమైన విషయం ఏమిటంటే...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను కూడా తీసుకువచ్చి విశాఖ కేంద్రంగా నడిచే 'దక్షిణ కోస్తా జోన్'లో కలిపారు. దీనివల్ల దాదాపు రాష్ట్రం అంతటికీ ఒకే జోన్, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారింది.

చేయాల్సినవి చాలా ఉన్నాయి

ఇల్లు అలకగానే సంబరం కాదన్నట్టుగా జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసి, డివిజన్ పేరు మారిస్తే సరిపోదు. చేయాల్సినవి చాలా ఉన్నాయి. కార్యాలయానికి శంకుస్థాపన జరిగినా ఇప్పటివరకూ ఒక్క పని మొదలు కాలేదు. ఆ నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. అలాగే ప్రత్యేక అధికారిని నియమించి, ఇక్కడి వ్యవహారాలు చకచకా ముందుకు నడిపించాలి. జోన్ కేంద్రానికి ఏమేమి అవసరమో...అన్నీ ఒక్కొక్కటి త్వరగా వచ్చేలా చూడాలి. రాయగడ డివిజన్‌కు అవసరమైన సిబ్బందిని ఎలాగైతే ఇక్కడి నుంచి పంపించేస్తున్నారో... జోన్ కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని కూడా రప్పించాలి. అప్పుడే మిగిలిన జోన్లతో దక్షిణ కోస్తా కూడా పోటీ పడుతుంది.

ఉద్యోగులకు నష్టం లేకుండా చూస్తాం

చలసాని గాంధీ,
రైల్వే యూనియన్ నాయకులు

డివిజన్ల పునర్విభజన వల్ల రైల్వే ఉద్యోగులకు ఎటువంటి నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపడతాం. ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం. తక్షణమే జోనల్ మేనేజర్‌ను నియమించాలి. అందుబాటులో ఉన్న భవనాల్లో కార్యాలయాలు నడపాలి.

నేడు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గురువారం నుంచి నగరంలో పర్యటించనున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖ చేరుకొని ఈనెల 10 వరకు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు.

పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

- డీఈవో, డీవైఈవోలతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం భేటీ



జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, ఉపవిద్యాశాఖాదికారి సోమేశ్వరరావుతో మాట్లాడుతున్న సీతారాం

ఆరిలోవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, ఉపవిద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతా రాం కోరారు. బుధవారం డీఈవో, డీవైఈవోతో కలిసిన సీతారాం మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 28 వేల 515 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు వీరిలో 15089 మంది బాలురు, 13 వేల 4 వందల 26 మంది బాలికలు హాజరవుతున్నారని తెలిపారు. 106 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, 448 ప్రైవేటు స్కూలువిద్యార్థులు హాజరవుతున్నట్టు తెలిపారు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన తెలిపారు.

విశాఖపట్నం డివిజన్ ప్రకటన పట్ల హర్షం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : వాల్తేర్ రైల్వే డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్ పేరుతో కొనసాగించాలన్న నిర్ణయం కూటమి ప్రభుత్వం సాధించిన మరో విజయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, గుంతుకల్ రైల్వే డివిజన్‌లతో ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ వల్ల రాష్ట్రానికి భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులు, కొత్త రైళ్లు వస్తాయన్నారు.

సినిమా గైడ్

- **మదగజరాజా :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **మహిష :** రమాదేవి
- **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 30, టమాటా 13, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 30, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 38, కీరదోస 32, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 56, దేముడు చిక్కుడు 32, గోరు చిక్కుడు 26, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఉత్తుత్తి తనిఖీలు.. అర్థం లేని ఆదేశాలు

- స్టీల్‌ప్లాంటు స్థలంలో బడ్డీల తొలగింపుపై అధికారుల్లో కానరాని చిత్తశుద్ధి
- ప్లాంటు అధికారుల నిర్లక్ష్యం.. జీవీఎంసీ బాధ్యతారాహిత్యం.. విద్యుత్ శాఖ విముఖత
- అధికారుల తీరుపై విమర్శలు



స్టీల్‌ప్లాంటు స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సులభ్ కాంప్లెక్సు వద్ద ఉన్న ఆక్రమిత బడ్డీల తొలగింపుపై జీవీఎంసీ అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, స్టీల్‌ప్లాంటు స్థలాలను కొనుగోలు చేసుకున్న యజమానులకు అడ్డుగా ఉన్నా వాటిని తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలో పత్రికలలో వస్తున్న కథనాలకు తూతూ మంత్రంగా ఒకటి రెండు బడ్డీలు తొలగించి వెళ్లిపోయారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో రెండు రోజులుగా వచ్చిన కథనాలకు స్పందించిన జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. అక్కడున్న శానిటరీ సిబ్బందితో మాట్లాడారు. బడ్డీలను రెండు రోజుల్లో తీసేమనండి, విద్యుత్ శాఖ వారికి కూడా తెలిపి విద్యుత్ సరఫరా కట్ చేయమని చెప్పమని ఆదేశించి వెళ్లిపోయారు. అయితే సంబంధిత అధికారులు లేకుండా తామేం చేయగలమని శానిటరీ సిబ్బంది ఏ చర్యలూ తీసుకోలేదు.

రోడ్డు పక్కన చిన్నపాటి తోపుడు బండి పెడితే వెంటనే తొలగించే జీవీఎంసీ అధికారులు ఇక్కడ ఆక్రమించిన పదుల సంఖ్యలో ఉన్న బడ్డీల తొలగింపునకు ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అటు స్టీల్‌ప్లాంటు అధికారులు ఈ బడ్డీలకు విద్యుత్ సరఫరా కట్ చేయాలని 4 నెలల క్రితమే లేఖను ఇచ్చి చేతులు దులుపుకున్నారు. బడ్డీలను తొలగించడంలో స్టీల్‌ప్లాంటు, జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు మాత్రం వెనుకంజ వేస్తుండడంతో అనేక అను మానాలకు తావిస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ విషయమై వరుస కథనాలకు ఈ ప్రాంతంలోని స్టీల్‌ప్లాంటు సిబ్బందిని ఉన్నతాధికారులు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. అంతే తప్ప బడ్డీల తొలగింపుపై ఎలాంటి చర్య చేపట్టలేదు.

ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ వద్ద ప్రస్తావించగా స్టీల్‌ప్లాంట్ స్థలాలను కొనుగోలు చేసుకున్న యజమానులు ఇళ్లు కట్టుకున్నప్పుడు బడ్డీలను తొలగించుకుంటారని, తాము పదే పదే ఆక్రమణలు తొలగించమని చెప్పుకొచ్చారు. ఇందుకోసం పోలీసుల చుట్టూ తిరగమని సమాధానమిచ్చారు. ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి చెబుతామని, వారే చూసుకుంటామని ధీమా సమాధానాన్ని ఇచ్చారు.



కబడ్డీ శిక్షణ కేంద్రంలో క్రీడాకారులతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

కబడ్డీ శిక్షణ కేంద్రం ప్రారంభం

పెదవాల్తేరు ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ క్రీడ వల్ల దేహదారుఢ్యంతో పాటు చక్కని నాయకత్వ లక్షణాలు పెంపొందుతుందనిఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఒడిశాలోని కటక్‌లో జరిగే జాతీయస్థాయి పురుషుల కబడ్డీ పోటీలో విజయం సాధించి కప్పుతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి, జేఎస్సీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుషుల జట్టు నుంచి 20 మంది కబడ్డీ క్రీడాకారులు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అందులో 12 మందిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేసి కటక్ పంపిస్తున్నట్టు చెప్పారు.ఈ కబడ్డీ శిక్షణ శిబిరం ఈ నెల 17 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వి. కృష్ణ, గోవింద్ లక్ష్మణ్, పండా శ్రీను, రమణా రెడ్డి, కోచ్‌లు వైవీ శ్రీను, చైతన్య పాల్గొన్నారు.

'నాంది' ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ



స్పోర్ట్ కిట్స్ అందుకున్న విద్యార్థులు, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల దేహ దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని నాంది ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.భానుదివ్య ప్రతిమ అన్నారు. బుధవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాంది ఫౌండేషన్ తరపున స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా భానుదివ్య ప్రతిమ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి చూపాలన్నారు. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. క్రీడా స్ఫూర్తి అలవడి జీవితంలో గెలుపు ఓటములను సమ దృష్టితో చూడగలిగే సామర్థ్యం వస్తుందన్నారు. అంతకుముందు నాంది ఫౌండేషన్ తరపున 204 మంది విద్యార్థులకు క్రీడా పరికరాల కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గరిమెళ్ల దుర్గాభవానీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలోని సంతపాలెం రహదారిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను బుధవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన జీవీఎంసీ అధికారులు వెంటనే దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళ వాకింగ్ చేసేవారు, వివిధ పనులపై రాకపోకలు సాగించే వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ బడ్డీలు ఉండడంతో ఫుట్‌పాత్‌పై నడిచే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పుడు తమ ఇబ్బందులు తొలగాలని హర్షం వ్యక్తం చేశారు.

నేత్రాల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



నేత్రాల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బషీర్, ఇతర వైద్యులు

ఆరిలోవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కంటికి గాయాలు తగిలినప్పుడు అప్రమత్తంగా మెలగాలని, ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా సంబంధిత వైద్యులను సంప్రదించాలని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యుడు బషీర్ అన్నారు. బుధవారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో నేత్ర వైద్య అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటికి తగిలిన గాయం చిన్నదైనా కొన్నిసార్లు దీర్ఘకాలంలో ప్రమాదకరంగా మారవచ్చన్నారు. అందుకే దెబ్బ తగిలినప్పుడే వైద్యులను సంప్రదించాలన్నారు. సకాలంలో వైద్య అందించడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. పదునైన వస్తువులు, కొన్ని స్థలాల్లో ఉన్నప్పుడు కంటికి గాయాలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీపీ, మధుమేహం ఉన్న వారు వైద్యులను కలిసి తనిఖీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ వైద్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



పద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆరో సెక్టరులోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 9 తేదీ వరకూ నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం, సాయంత్రం యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, దేవతాహ్వానం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పుష్పార్చన, నిత్యహోమాలు, శుక్రవారం గాగశాలార్చన 30వ ప్రతిష్టా వార్షిక కళ్యాణం, శనివారం తులసీదళార్చన, పండిత సదస్యం, ఆదివారం కుంభప్రోక్షణం అలాగే ఈ నెల 12న శ్రీ ఉమారాలింగేశ్వర స్వామివారి 41వ ప్రతిష్టా వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహక సంస్థ శ్రీమదుభయ వేదాంతాచార్య పీఠం తెలిపింది.

15వ వార్డు సచివాలయంలో గత ప్రభుత్వ పథకాల చార్టులు



15వ వార్డు సచివాలయంలో ప్రదర్శనలో ఉంచిన గత ప్రభుత్వ పథకాల చార్టులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారితే వెంటనే కార్యాలయాల్లో నూతన ప్రభుత్వానికి సంబంధించిన చిత్రాలు, ప్రజాప్రతినిధుల ఫోటోలు ఉంచడం రివాజు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారి 7 నెలలు గడిచినా 15వ వార్డులోని వార్డు సచివాలయం సిబ్బందికి మాత్రం గత ప్రభుత్వంపై ప్రేమ పోనట్టుంది. గత ప్రభుత్వ పథకాలన్నీ రద్దయినా, కొన్ని పథకాల పేర్లు మారినా ఇక్కడ మాత్రం ఇంకా గత ప్రభుత్వ హయాంలోని పథకాలు, సూచనలే కనిపిస్తున్నాయి. ఈ సచివాలయాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రాలు, ఆయన పేరు మీద పథకాలకు సంబంధించిన బోర్డులనే ప్రదర్శిస్తున్నారు. దీన్ని బట్టి సచివాలయాల పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

'కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలి'

మహారాణిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

సహృదయ సాహితీ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో కవితా పఠనం

సీతమ్మధార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో జరిగిన సమ్మేళనం సభికులను అలరించింది. ఈ సందర్భంగా శేఖరమంత్రి ప్రభాకర్, డాక్టర్ జి.వేణు మాట్లాడుతూ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని, కవి సమాజ శ్రేయోభిలాషి అని తెలిపారు. కార్యక్రమంలో డీవీ సూర్యారావు, సూరేనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, పీవీఆర్ కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం



హెచ్‌ఎం రెడ్డికి నివాళి అర్పిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు కాశీవిశ్వేశ్వరరావు, నరవ ప్రకాశరావు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : యువత చైతన్యవంతమైన చిత్రాలను వీక్షించి అందులోని భావాలను తెలుసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. తెలుగు సినిమా దినోత్సవం పురస్కరించుకుని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్‌ను బుధవారం పౌర గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎఫ్ఎస్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా అభివృద్ధికి దోహదం చేసిన వారిని గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. అంతకుముందు పలువురు తొలి తెలుగు టాకీ చిత్రం దర్శకుడు హెచ్‌ఎం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఘనంగా దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలు



అభిమానులు, నేతల మధ్య భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, వంశీకృష్ణ శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శివాజీపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయానికి పెద్ద ఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పూలబొకేలు అందించి, శాలువాలు కప్పి వంశీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా ఉదయం వంశీకృష్ణ సతీసమేతంగా శ్రీకనకమహాలక్ష్మీ, వరహా నరసింహాస్వామి (సింహాచలం) దర్శనానికి వెళ్లారు. అనంతరం శివాజీపాలెంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అలాగే కార్యకర్తలు తీసుకొచ్చిన భారీ కేక్‌ను వంశీకృష కట్ చేసి తినిపించారు. ఈ వేడుకల్లో డప్పులు మోతలకు అభిమానులు ఆడిపాడి సందడి చేశారు. కోలాటం నృత్యాలతో అలరించారు.

ఈ సందర్భంగా వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ అభిమానుల అభిమానం వెలకట్టలేనిదన్నారు. తన పుట్టినరోజును పండుగలా నిర్వహించిన వారి ఆప్యాయత అనురాగాలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వంశీకృష్ణ

విమ్స్‌లో డెంటల్ చైర్స్ ప్రారంభం



డెంటల్ చైర్స్ ప్రారంభిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో ఆధునిక డెంటల్ చైర్స్‌ను సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దంత వ్యాధిగ్రస్తులకు ఈ ఆస్పత్రిలో ఉత్తమ సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. డెంటల్ చైర్స్‌ను సమకూర్చిన సీజీహెచ్‌ఎస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోగల వెల్‌నెస్ నెంబరు-2ను త్వరలో విమ్స్‌లో 'సీడ' విభాగానికి మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని రెండు వెల్‌నెస్ సెంటర్ల ఇన్‌చార్జిలు డాక్టర్ సుభానీ, డాక్టర్ శ్యామ్‌కిషోర్ బాబు, ఆర్‌ఎంవో డాక్టర్ శిరీష, రాంబాబు, టీడీ రాజు, ఎంఆర్డీ రాజు, కేవీడీ స్వామి, డెంటల్ విభాగం వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మన ఇంటి పంట ఆరోగ్యకరం



ఇంటిపై పెంచుతున్న కూరగాయలను పరిశీలిస్తున్న గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మన ఇంటి పంట చాలా ఆరోగ్యకరమని టెలికాం విశ్రాంత అధికారి కేఎం రావు అన్నారు. ఉషోదయ కూడలి దగ్గర తన ఇంటిపై పెంచుతున్న కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కల పరిశీలనకు వచ్చిన గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో ఆయన మాట్లాడారు. అధ్యాపకురాలు డాక్టర్ వరలక్ష్మి, ఎన్‌జీవో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ వంటింటి వ్యర్థాలను ఎరువుగా తయారు చేసుకోవడం ద్వారా ఇంటిపై మంచి మొక్కలను పెంచుకోవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మన పంటను మనమే పండించుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని అన్నారు. జీవీఎంసి ఎకో వైజాగ్‌ను అందరూజయప్రదం చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత




బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం అందజేశారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 17వ వార్డులోని పెదవాల్తేరుకు చెందిన బోర పోలిరెడ్డికి రూ.1,07,660లు, 23వ వార్డులోని మద్దిలపాలేనికి చెందిన రెడ్లమ్ రామకృష్ణకు రూ. 2,09,659లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతనరెడ్డి పాల్గొన్నారు.

'నా వాళ్లు, వాళ్ల ఆనవాళ్లు' పుస్తకావిష్కరణ

సీతమ్మధార, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ రచించిన నా వాళ్లు, వాళ్ల ఆనవాళ్లు పుస్తకాన్ని డాక్టర్ మోటూరి రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సితార, డీవీ సూర్యారావు, డీఆర్‌కే రావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కేవీఎస్ మూర్తి, సూర్యనారాయణ, రామకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

వెట్టి నుంచి విముక్తి!



» అనేక జిల్లాల్లో ఇప్పటికీ బయటపడని వారెందరో

» వారిని గుర్తించి, బయటకు తెచ్చే కృషి చేస్తున్నామంటున్న జీవన జ్వాల స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఏళ్లుగా మగ్గిపోతున్న వారికి ఉపశమనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): **వారు వెట్టి చాకిరీ బాధితులు.. అవసరం మేరకు అప్పులు చేసి, తీర్చలేక పనికి కుదిరి బందీలైన వారు కొందరు, ఇతరులకు సహాయం చేద్దామని భావించి అప్పు ఇప్పించి ఇరుకున్న మారు మరికొందరు, చిన్న తనంలోనే కష్టాల కొలిమిలో కూరుకుపోయి, కడుపు నింపుకోవడానికి కూలికి వెళ్లి చిక్కుకు పోయిన వారు మరికొందరు. ఇలా ఏళ్లుగా వెట్టిలో మగ్గిపోయి, అధికారులు, స్థానికుల చొరవతో బయట పడి, తమలా అవస్థలు పడుతున్న వారికి స్వేచ్ఛా వాయువులు అందించేందుకు జీవన జ్వాల స్వచ్ఛంద సంస్థ పేరిట కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఇలా వెట్టి చాకిరీ చేస్తున్న వారిని విడిపించడమే ధ్యేయంగా పనిచేస్తామంటున్నారు.**



రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు వివిధ వృత్తుల్లో వెట్టి చాకిరీ చేస్తున్నారని, అలాంటి వారికి స్వేచ్ఛను ప్రసాదించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని జీవన జ్వాల స్వచ్ఛంద సంస్థ సభ్యులు వెల్లడించారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ హోటల్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వెట్టి చాకిరి చేసి, అధికారుల చొరవతో బయటకు వచ్చిన పలువురు బాధితులు ఈ సమావేశంలో తాము పడిన ఇబ్బందులను వెల్లడించారు. తినేందుకు తిండి కూడా లేకుండా వేధింపులకు గురి చేస్తారని, ఇచ్చిన అప్పునకు వడ్డీ, చక్రవడ్డీలు చెల్లించే వరకు కుటుంబమంతా వారి వద్దే పనిచేయాలని వాపోయారు. ఏళ్ల తరబడి పనిచేసినా కనీస వసతులు కల్పించకుండా శారీరక, మానసిక వేధింపులకు గురిచేసేవారని వాపోయారు. సార్డ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఆర్.సునీల్ కుమార్ అనేక వృత్తుల్లో మగ్గిపోతున్న వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు గుక్కెడు మెతుకుల కోసం వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారన్నారు. సోషల్ వర్కర్లు ప్రియాంక, టి.రమేష్, జేసుదాసు మాట్లాడుతూ 1976 చట్టం ప్రకారం వెట్టి చాకిరీ నేరమన్నారు. ఈ వ్యవస్థను రూపు మాపాలన్నారు. ఇప్పటివరకు సుమారు 70 మందికి ప్రభుత్వ అధికారుల సహాయంతో విముక్తి కల్పించామన్నారు.

బాధితులు వేదన వర్ణనాతీతం..

వెట్టి చాకిరీ చేసి జీవితాలు నాశనమైన వారెందరో ఉన్నారు. అటువంటి వారి వేదన వర్ణణాతీతం. రెండు నుంచి 20 ఏళ్లపాటు వెట్టిచాకిరీ చేసి సర్వం కోల్పోయిన వారిలో కొందరు ఈ సమావేశంలో మాట్లాడి తాము అనుభించిన వేదన, పడిన కష్టాలను వివరించారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన వారంతా కలిసి జీవన జ్వాల పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి తమలాంటి వారిని విముక్తి చేసేందుకు పోరాడుతున్నారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది సభ్యులు న్నారు. ఈ నెల 9న వెట్టిచాకిరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాధితులకు భరోసా కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

15 ఏళ్లు వెట్టి చాకిరీ చేశా



మాది చిత్తూరు జిల్లాలోని పద్మ సరస్సు గ్రామం. నాకు ఏడేళ్ల వయసులో అక్క రూ.20 వేలు అప్పు తీసుకుంది. అది తీర్చడానికి అక్కతో కలిసి రేణిగుంట సమీపంలోని బియ్యపు మిల్లు యజమాని వద్దకు పనికి వెళ్లాం. 15 ఏళ్లపాటు పనిచేసినా అప్పు తీరలేదు. ఈ క్రమంలోనే మా అక్కను చంపేశారు. మేనల్లుడు కూడా ప్రమాదంలో చనిపోయాడు. అధికారుల సహాయంతో గత ఏడాది నవంబరులో మిల్లు నుంచి బయటకు వచ్చాను. 15ఏళ్లపాటు ఎలా బతికానో తెలియదు. పురుగుల బియ్యమే అన్నం వండుకోవాలి. బయటకు వెళ్లడానికి అవకాశం ఉండదు. వెట్టి చాకిరీ కంటే దారుణమైన బతుకు ఇంకొకటి ఉండదు. బయటిపడిన తరువాత తమలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని భావిస్తున్నాం.

- టి.అజిత్, బాధితుడు

ఆరేళ్ల నరకయాతన



ఎనిమిదేళ్ల వయసులో కదిరిలో రాళ్లు కొట్టే పనికి వెళ్లాను. ఆరేళ్లపాటు నలుగురి వద్ద పనిచేశాను. 13 కుటుంబాలు పనిచేయగా, అందరికీ కలిపి కేజీ బియ్యం ఇచ్చేవారు. పచ్చి మిర్చితో గంజి అన్నం తినాలి. బయటకు వెళ్లడానికి లేదు. చిన్నపాటి షెడ్డులో ఇద్దరు, ముగ్గురు ఉండాలి. రోగం వచ్చినా దిక్కు లేదు. పని చేయాల్సిందే. మగవాళ్లకు గంజాయి, సారాయి ఇచ్చి చెప్పినట్టు వినేలా చేసేవారు. నరకయాతన అనుభవించాం. ఈ కష్టం ఎవరికీ రాకూడదు. మా గురించి తెలుసుకున్న కొందరు అధికారులు విముక్తి కల్పించారు. 2005లో బయట పడి, నాలాంటి వారి కోసం పనిచేస్తున్నాను.

- వి.జ్యోతి, బాధితురాలు

అప్పు ఇప్పించిన వారు రాలేదని



మా నాన్న స్థానికంగా పనులకు తీసుకెళ్లేవాడు. బెంగళూరులో ఇటుకలు తయారుచేసే వ్యక్తితో పరిచయమయింది. మాకు తెలిసిన వారికి రూ.20వేలు అప్పు ఇప్పించాడు. ఆ పనికి వారు వెళతానని వెళ్లలేదు. దీంతో అప్పు తీర్చడానికి ఏడో తరగతి చదువుతున్న నన్ను కూడా తీసుకెళ్లారు. రెండేళ్లపాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది. కుటుంబంలోని ఏడుగురు వెళ్లాం. ఎన్నేళ్లు పనిచేసినా రూపాయి తీరలేదు. మా ఇబ్బందులను ఎవరో తెలుసుకుని అధికారులకు సమాచారం ఇవ్వడంతో విడిపించారు. ప్రస్తుతం జీవన జ్వాలలో పనిచేస్తూ బాధితులు విముక్తి కోసం కృషి చేస్తున్నా.

- తీన్మోయి, పుత్తూరు

విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

» రూ.6 లక్షల చొప్పున వసూలు చేశారని బాధితుడి ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ కన్సల్టెన్సీ మోసానికి పాల్పడిందని బాధితుడు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్దిలపాలెం జయభేరీ రోడ్డులోని ఓవర్సీస్ క్యారియర్ కన్సల్టెన్సీ పేరిట కార్యాలయం ఉంది. 2023, అక్టోబరులో యూరోపియన్ దేశాల్లో వేర్‌హౌస్ సూపర్‌వైజర్, స్టోర్ కీపర్ పోస్టులున్నాయని, ఉద్యోగం కావాలంటే సంప్రదించాలని పత్రికల్లో ప్రకటన ఇచ్చారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, తప్పుడు నియామకపత్రాలతో మొంటెనెగ్రోకి పంపించారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.6 లక్షల చొప్పున మొత్తం 12 మంది నుంచి రూ.72 లక్షలు వసూలు చేశారు. నెలకు రూ.1.5 లక్షలు జీతం ఇస్తారని, భోజనం, వసతి ఉచితమని నమ్మబలికారు. అక్కడకు వెళ్లిన తర్వాత అవి నకిలీ నియామక పత్రాలని, ఆయా సంస్థలు గడ్డి కోయించాయి. సరైన భోజన వసతి లేదు. నెలకు రూ.30 వేలు మాత్రమే చెల్లించాయి. దీంతో మోసపోయినట్టు గ్రహించి, తంటాలు పడి తిరిగి వచ్చేశారు. సంస్థను నిర్వహిస్తున్న పేపకాయల విజయ్‌కుమార్, మోసిన్ షేక్ అహ్మద్, నుజత్, భారతి, గంద్రేటి రఘుమయిలను నిలదీసినా వారు పట్టించుకోకపోవడంతో బాధితుడు పైల వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి, సీఐ మురళి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కేసుల దర్యాప్తుపై పోలీసులకు శిక్షణ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల కట్టడికి చట్టపరమైన అంశాలు, దర్యాప్తులో జాగ్రత్తలపై ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు నరసింహనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సస్, నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎలైట్ యాంటీ, నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) డైరెక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ అధికారులు డ్రగ్స్ సమస్య తీవ్రత, దానికి వెనుక మానవీయ కోణాన్ని అర్థం చేసుకోవాలన్నారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ అనేక చర్యలు, ప్రోత్సాహకాల ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంజాయి సాగును గణనీయంగా నియంత్రించామన్నారు. నాసిన్ శిక్షణ సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్ ఈదర రవికిరణ్ మాట్లాడుతూ డ్రగ్స్ కట్టడికి పోలీస్, ఎక్సైజ్, కేంద్ర ప్రభుత్వ కస్టమ్స్, డీఆర్ఐ తదితర శాఖల మధ్య మరింత సహకారం, సమన్వయం పెరగాలన్నారు.

అయ్యన్న వ్యాఖ్యలకు నిరసనగా మన్యం బంద్

» 11, 12 తేదీల్లో నిర్వహణ » అఖిలపక్షం పిలుపు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల మనుగడకు ఆయువుపట్టుగా ఉన్న 1/70 చట్టంపై అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం నుంచి స్పందన లేనందున ఈ నెల 11, 12 తేదీల్లో మన్యం బంద్‌కు నిర్ణయం తీసుకున్నామని పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు తెలిపారు. బుధవారం స్థానిక బిస్మిల్లా కల్యాణ మండపంలో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. బంద్‌లో గిరిజనులంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ నాయకులు కె.రాధాకృష్ణ, డీఎల్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కుమార్, గిరిజన సంఘం నాయకులు పాలికి లక్కు, సీఐటీయూ నాయకులు ఎల్.సుందరరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.07 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకల ద్వారా సుమారు రూ.2.07 కోట్లు ఆదాయం సమకూరింది. ఈవో వేంద్ర త్రినాధరావు పర్యవేక్షణలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. ఇందులో రూ.2,07,32,249 నగదు, స్వర్ణం 79 గ్రాములు, రజితం 10.9 కిలోలు ఆభరణాల రూపంలో లభించినట్టు అధికారులు ప్రకటించారు. సరాసరిన రోజుకు రూ.6,91,075 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు యూఎస్‌ఏకు చెందిన 284 డాలర్లు, ఆస్ట్రేలియాకు చెందిన ఐదు డాలర్లు, కెనడాకు చెందిన 25 డాలర్లు, సింగపూర్ 12 డాలర్లు, యూఏఈకి చెందిన 8,425 ధీరమ్స్, మలేషియాకు చెందిన 67 రింగట్స్, ఖతర్‌కు చెందిన 17 రియల్స్, సౌదీఅరేబియాకు చెందిన 50 రియల్స్, శ్రీలంకకు చెందిన 40 రుపీలు అప్పన్న ఖజానాకు సమకూరాయి. లెక్కింపులో పలువిభాగాల ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, సేవా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు పెంపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల ఎనిమిది వరకు గడువు పొడిగించినట్టు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. జిల్లాలో శెట్టిబలిజ సామాజికవర్గానికి 11, యాతకు ఒకటి, గౌడలకు రెండు దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల ఐదు వరకు గడువిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. తాజాగా గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల తొమ్మిన దరఖాస్తులు పరిశీలిస్తారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సమక్షంలో ఈనెల పదిన జడ్పీ కార్యాలయంలో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు, అదే రోజు తాత్కాలిక పర్మిట్ల జారీ జరుగుతుందని ప్రసాద్ తెలిపారు.

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను తిరస్కరించాలి

» అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్

» లేబర్స్ కోడ్స్, బడ్జెట్ ప్రతులు దహనం చేసి నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు

సిరిపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, లేబర్ కోడ్స్ రద్దుచేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఎఫ్‌టీయూఐ, ఏపీఎఫ్‌టీయూ తదితర సంఘాల నాయకులు ఆర్కేఎస్వీ కుమార్, జీఎస్‌జే అచ్యుతరావు, బి.నాగభూషణం, ఎన్.కనకారావు, దేవా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టారన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కేంద్రం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చి కార్మికులను బానిసలుగా మార్చిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు సమ్మె చేసే, సంఘాలు పెట్టుకునే హక్కులను కోల్పోతారన్నారు. వీటిని రద్దు చేయకుండే భవిష్యత్తులో దేశ వ్యాప్త సమ్మె, బంద్ చేయడానికి కార్మికవర్గం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ముందుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లైవోవర్ వరకు ప్రదర్శనగా వెళ్లి తిరిగి జీవీఎంసీ వద్దకు చేరుకున్నారు. అనంతరం లేబర్ కోడ్స్, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.వెంకటరెడ్డి, పి.మణి, సుబ్బారావు, మన్మథరావు, రెహమాన్, వెంకట్రావు, రామచంద్రరావు, ఈశ్వరరావు, బాబురావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో వైసీపీకి ఎదురుదెబ్బ

» టీడీపీలో చేరిన 600 కుటుంబాలు


» కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే గంటా



శ్రీకాంత్ రాజుకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆనందపురం మండలం రామవరం పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, భీమిలి మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ కాకర్లపూడి వరహాలరాజు, ఆయన కుమారుడు శ్రీకాంత్ రాజు తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం రామవరంలో జరిగిన సభలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రాజు మాట్లాడుతూ తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో గంటా శ్రీని వాసరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరామన్నారు. గంటా ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించి, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కణమాం ఎంపీ టీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సీతారామరాజు, శొంఠ్యాం సొసైటీ మాజీ డైరెక్టర్ ఎం. సత్తిబాబు, పంచాయతీకి చెందిన 600 కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్నకుమారి లక్ష్మి, లొడగల అప్పారావు, నాయకులు గంటా సుభాష్‌చంద్రబోస్, గంద్రెడ్డి స్వామినాయుడు, బీఆర్‌బీ నాయుడు, తాతారాజు అప్పారావు, కాళ్ల నగేష్, కె. దామోదరరావు, గంద్రెడ్డి రమేశ్, కోరాడ రాము, కాకర వెంకటరమణ, బలిరెడ్డి చంటి, కర్రి శ్రీను, పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ : కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే నులి పురుగుల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈనెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై బుధవారం ఆయన తన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు. విద్య, వైద్య, సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

మొన్న శిలాఫలకం వేశారు.. నేడు తీసేశారు

» ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో కొందరి అత్యుత్సాహం



ఇటీవల వేసిన శిలాఫలం... బుధవారం నాటికి ఇలా...

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధికారుల వ్యవహారశైలి వివాదాలకు కారణమవుతోంది. ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా అత్యుత్సాహంతో చేస్తున్న పనులు విమర్శలకు దారితీస్తున్నాయి. తాజాగా ఈ విభాగానికి దాత మూడు కంప్యూటర్లు అందించారు. ఓ గదిలో వాటిని ఉంచి కంప్యూటర్ ల్యాబ్‌గా పేరు పెట్టి, శిలాఫలాకాన్ని ఏర్పాటు చేశారు. దానిపై ప్రారంభకులుగా ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాధిపతి పేరు ముద్రించారు. వర్సిటీలో శిలాఫలకాలు ఏర్పాటు చేయాలంటే రిజిస్ట్రార్ అనుమతి అవసరం. తాజాగా ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడం, వారు అభ్యంతరం వ్యక్తం చేయడం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో హుటాహుటిన బుధవారం దానిని తొలగించారు.